

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

సమస్యల వలయంలో గురుకులాలు

- పలు అంబేద్కర్ బాలికల పాఠశాలల్లో పురుష ఉద్యోగులు
- సమస్యలపై పట్టించుకునే వారేరి?



దేవపట్ల పాఠశాలలో అసంపూర్తిగా భవనాలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంబేద్కర్ బాలికల గురుకులాల్లో విద్యార్థినులు అనేక సమస్యల నడుమ తమ చదువులను సాగిస్తున్నారు. కొన్ని పాఠశాలలకు ప్రహరీ లేదు. విష పురుగులు పాఠశాలల్లోకి వస్తున్నాయి. వీటిల్లో పురుష ఉద్యోగులు పనిచేయకూడదనే నిబంధనలు ఉన్నా కొన్ని పాఠశాలల్లో పనిచేస్తున్నారు. మూడు రోజుల కిందట లక్కిరెడ్డిపల్లె మండలంలో ఉన్న అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న 5వ తరగతి విద్యార్థినిపై ప్రిన్సిపాల్ భర్త అసభ్యకరంగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. నిందితుడిని అరెస్టు చేశారు. ప్రిన్సిపాల్‌పైనా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని పలు గురుకుల పాఠశాలల్లో పలువురు మగ ఉద్యోగులు పనిచేస్తూ ఉన్నారు. సాధారణంగా బాలికల పాఠశాలల్లో మగ ఉద్యోగులు ఉండకూడదు. అయినా పలు గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 11 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఇందులో బాలికలకు సంబంధించి 8 పాఠశాలలు ఉండగా బాలురకు సంబంధించి మూడు ఉన్నాయి. ఇందులో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థినులు చదువుకుంటున్నారు. బాలికల గురుకుల పాఠశాలలు 8 ఉండగా అందులో రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, ఆడపూర్, దేవపట్ల, పీలేరు, వాల్మీకిపురం, మదనపల్లె, బురకాయలకోటలలో బాలికల గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఈ గురుకులాల్లో ఉన్న సమస్యలను ఒకసారి పరిశీలిస్తే..

- ములకలచెరువు మండలం బురకాయలకోట అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 568 మంది విద్యార్థినులు ఉన్నారు. ఈ పాఠశాలకు ప్రహరీగోడ ఉన్నప్పటికీ లోపల, బయట గుట్ట ప్రాంతం కావడంతో చుట్టుపక్కల పెద్దపెద్ద రాళ్లు.. పిచ్చిమొక్కలు భారీగా ఉండడంతో అడవిని తలపిస్తోంది. పాముల బెడద ఎక్కువగా ఉంది. పలు సందర్భాలలో పాములు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయి. పాఠశాలలో ప్రిన్సిపాల్ క్వార్టర్ ఉంది. ఉద్యోగులు, టీచర్లకు లేవు. 24 మంది మహిళా ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. నాన్‌టీచింగ్ విభాగంలో నలుగురు పురుష ఉద్యోగులు ఉన్నారు. వీరు ఉదయం 10.30కి విధులకు వచ్చి సాయంత్రం 5.30 గంటలకు వెళ్లిపోతున్నారు.
- మదనపల్లె పట్టణంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 600 మంది బాలికలు ఉన్నారు. ఈ గురుకులం ప్రహరీగోడ చుట్టూ ప్రస్తుతం ఇళ్లు నిర్మించడంతో ప్రహరీగోడ ఎత్తు తక్కువగా అయిపోయింది. దీంతో వీధి కుక్కలు తరచూ ఈ కాంపౌండ్ వాల్ దూకి లోపలికి వచ్చి విద్యార్థినులను ఇబ్బంది పెడుతున్నాయి. ఈ పాఠశాల లోపల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వర్షం వస్తే విద్యార్థినులు బురదలో నడవాల్సి వస్తోంది. ఈ పాఠశాలలో 13 క్వార్టర్లు ఉన్నాయి. ఇందులో మహిళా ఉద్యోగులే పనిచేస్తున్నారు. ఈ పాఠశాల ఆవరణలో నాలుగు 11 కేవీ విద్యుత్ వైర్లు వెళుతున్నాయి. దీనివల్ల ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ విద్యుత్ లైన్లను మార్చమని పది సంవత్సరాలుగా ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు.
- వాల్మీకిపురం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మొత్తం సిబ్బంది 25 మంది ఉండగా...అందులో జూనియర్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా మగ ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రిన్సిపల్ క్వార్టర్ 1, స్టాఫ్ క్వార్టర్స్ 6 ఉన్నాయి, అందరూ ఇక్కడే ఉంటున్నారు. ఈ పాఠశాలకు ఆనుకుని సమీపంలోనే గత ప్రభుత్వం జగనన్న కాలనీ నిర్మాణం సమయంలో ఒకవైపు ప్రహరీ కూలిపోయింది. కొత్తగా నిర్మించారు. అయితే గతంలో ఎనిమిది అడుగులు ఉన్న గోడ ప్రస్తుతం నాలుగు అడుగులు మాత్రమే ఉంది. దీనివల్ల బయట వ్యక్తులు ఎవరైనా సులువుగా వచ్చే ప్రమాదముంది.
- దేవపట్ల బాలికల గురుకుల పాఠశాలలో 418 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరు మౌలిక వసతుల లేమితో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక బోరు సరిపోవడం లేదు. ప్రైవేటు వ్యక్తి నుంచి నీళ్లు తీసుకుంటున్నారు. 12 ఏళ్లుగా డార్మెటరీ నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో ఉన్న మరుగుదొడ్లు విద్యార్థినులకు సరిపోవడం లేదు. ల్యాబ్ నిర్మాణ పనులు జరగలేదు. అసంపూర్తిగా ఉన్న భవనంలో విద్యార్థినులు బట్టలు ఆరేసుకుంటున్నారు. భోజన వసతి కోసం నిర్మిస్తున్న భవనాలు పూర్తి కాలేదు.
- లక్కిరెడ్డిపల్లె బాలికల గురుకుల పాఠశాలలో ఐదు సంవత్సరాలుగా తాగునీటితో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. గురుకులం చుట్టూ ప్రహరీ గోడ లేదు.. సరైన మరుగుదొడ్లు లేవు. ప్రభుత్వం ఇచ్చిన మినరల్ వాటర్‌ప్లాంటు చెడిపోయి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు పట్టించుకోలేదు. పిల్లలు ఫ్లోరైడ్ నీళ్లు తాగాల్సి వస్తోంది. ఈ విషయమై ఎందరో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక్కడికి ఏ ప్రిన్సిపాల్ వచ్చినా తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పాఠశాల సమస్యలు పట్టించుకుకోకుండా వ్యక్తిగత విమర్శలు చేసుకుంటూ, పాఠశాల అభివృద్ధి కోసం పని చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గురుకులం చుట్టూ ప్రహరీగోడ లేదు. సిబ్బంది ఉండడానికి క్వార్టర్లు లేవు. తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు జరగలేదు.
- రాయచోటి మండలంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 560 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇక్కడ 24 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పాఠశాల ఆవరణలో 6 క్వార్టర్లు ఉన్నాయి. అందులో ప్రిన్సిపాల్, మరికొంత మంది ఉపాధ్యాయులు, స్టడీ అవర్స్ ఉపాధ్యాయులు నివాసం ఉంటున్నారు. నాన్‌టీచింగ్ స్టాఫ్ ఏడుగురు ఉండగా అందులో ఐదుగురు పురుషులు, ఇద్దరు మహిళలు పనిచేస్తున్నారు. వీరంతా సాయంత్రం 6 గంటలకు విధులు ముగించుకుని వెళ్లిపోతారు. వంట మనుషుల్లో కూడా ఆరుగురు ఉండగా అందులో ఇద్దరు పురుషులు ఉన్నారు. రాత్రి భోజనాల తర్వాత వీళ్లు ఇంటికి వెళ్లిపోతారు. ప్రహరీగోడ లోపల కంపచెట్లు, పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో విషపురుగులు వస్తున్నాయి.

జిల్లాలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో ఇన్ని సమస్యలు ఉంటున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు తరచూ ఈ గురుకుల పాఠశాలలను తనిఖీ చేయకపోవడం వల్లే సమస్యలు పరిష్కారం కావడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా కలెక్టర్ స్పందించి బాలికల గురుకుల పాఠశాలల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



బురకాయలకోట గురుకుల పాఠశాల ఆవరణలో గుబురుగా పెరిగిన చెట్లు



వాల్మీకిపురం పాఠశాలలో తక్కువ ఎత్తులో ఉన్న ప్రహరీ

ముఖ్యమైన ఫైళ్లు కాల్చేస్తే చిత్తు కాగితాలంటారా..

- ఎంపీ మిథున్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే ఆగ్రహం
- వరద బాధితుల సహాయార్థం రూ.6 లక్షల విరాళాలు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 4: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ముఖ్యమైన ఫైళ్ల దహనంపై ఎంపీ మిథున్‌రెడ్డి వక్రీకరించి మాట్లాడటం తగదని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫైళ్ల దహనం ఘటనపై ఎంపీ మిథున్‌రెడ్డి చిత్తు కాగితాలు కాలిపోతే రాద్ధాంతం చేస్తున్నారని వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో తాడేపల్లె ప్యాలెస్ బయటకు రాని జగన్, నేడు విజయవాడ వరదలపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న సహాయ చర్యలను రాజకీయం చేస్తూ తప్పుపట్టడం తగదన్నారు. ఇది ఒకరిపై బురదజల్లే సమయం కాదన్నారు. ఇష్టముంటే వరద బాధితులకు సహాయం చేయాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు వరద బాధితులను ఆదుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. వరద బాధితుల సహాయార్థం తాను రూ.2 లక్షల సొంత నిధులు విరాళమిస్తున్నానని ఎమ్మెల్యే ప్రకటించారు. దీంతో మున్సిపల్ కౌన్సిలర్ నాగార్జునబాబు (గాంధీ) రూ.52 వేలు, గంగారపు ఫణికర్ రూ.52 వేలు, జహా యువసేన రూ.51 వేలు విరాళాలు ప్రకటించారు. వీరితో పాటు టీడీపీ నాయకులు సంగం శ్రీనివాసులు, విద్యాసాగర్, షంషీర్, నాదెళ్ల శివన్నతో పాటు పలువురు వరద బాధితుల కోసం విరాళాలు అందజేశారు. మొత్తం రూ.6 లక్షల వరకు ఐదు నిముషాల్లో టీడీపీ నాయకులు విరాళాలు అందజేశారు. రాటకొండ గుర్రప్పనాయుడు, నవీన్‌చౌదరి, బాలుస్వామి, కత్తి లక్ష్మన్న పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం మెనూలో మార్పులు : కలెక్టర్



ఇస్కాన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 4: విద్యార్థులందరూ ఇష్టపడి భోజనం చేసేలా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం మెనూలో మార్పులు చేశామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంపై విద్యా శాఖాధికారులు, ఇస్కాన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ పథకంలో అమలవుతున్న ప్రస్తుత మెనూలో సోమవారం నుంచి శనివారం వరకు ఉన్న రకరకాల ఆహార పదార్థాల గురించి వారు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో పోషకాహార లోపాలను నివారించడానికి, ప్రభుత్వ బడులకు వచ్చే పిల్లల సంఖ్య పెంచడానికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకం గురించి ఇస్కాన్ ప్రతినిధులు మెనూలో మార్పులు చేస్తే బాగుంటుందని తెలిపారు. పొంగలి అంటే విద్యార్థులు ఇష్టపడటం లేదని దానికి బదులుగా బియ్యంతో చేసిన భోజనాన్ని ఇష్టపడుతున్నట్లు తెలిపారు. ఈ విషయంపై డీఈవో శివప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ఇస్కాన్ ప్రతినిధులు చేసిన భోజనాలు హాట్‌బాక్స్‌లో పంపిస్తే బాగుంటుందని తెలిపారు. ఈ పథకంలో మెనూ ప్రకారం పెట్టే ఆహార పదార్థాల గురించి చర్చించారు. అన్నం, మిరియాల రసం, ఉడికించిన గుడ్డు, ఆకుకూర పప్పు, స్వీట్ పొంగలి, టమాటా రసం, కందిపప్పుచారు, తదితర మెనూ సిద్ధం చేసినట్లు వారు కలెక్టర్‌కు వివరించారు. ఈ పథకం కొన్ని రోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వారు వివరించారు. డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, మండల విద్యా శాఖాధికారులు, ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నంలో పురుగులు

- కస్తూర్బాగాంధీ విద్యాలయంలోని వంటకాల్లో పురుగులు
- విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు
- తాగడానికి బోరు నీరే గతి.. తాగునీటి తొట్టెలో బల్లులు
- ఇంటి బాట పడుతున్న విద్యార్థినులు
- ప్రశ్నిస్తే తినిచచ్చి చదువులో చూపించండని సమాధానం.. బిత్తరపోతున్న విద్యార్థినులు



ఉప్మాలో వచ్చిన పురుగులు



తాగునీటి తొట్టెలో ఉన్న బల్లి

ములకలచెరువు, సెప్టెంబరు 4: అన్నంలో పురుగులు, ఉప్మాలో పురుగులు, ఆఖరికి చారులో కూడా పురుగులు ఇలా ఏది చూసినా పురుగులమయమే. తాగునీటి తొట్టిలో బల్లులు.. ఇలా ములకలచెరువులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. పురుగులు పట్టిన బియ్యం, కుళ్లిపోయిన కూరగాయలతో నిత్యం వంటకాల్లో పురుగులు కన్పిస్తున్నాయి. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి సమీపంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 250 మంది వరకు విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఇక్కడే వారికి హాస్టల్ వసతి ఉంది. పాఠశాలలో వండుతున్న వంటకాల్లో తరచూ పురుగులు కన్పిస్తుండడంతో చేసేది లేక పురుగులు వస్తే పక్కకు తీసి తినాల్సిన దుస్థితి నెలకొంది. అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో తింటున్న వంటకాల్లో పురుగులు కన్పిస్తూనే ఉన్నాయి. పాఠశాలకు అందిస్తున్న బియ్యం సరిగ్గా లేకపోవడం, కూరగాయలు, ఆకుకూరల్లో నాణ్యత లేని కారణంగా నెల రోజులుగా ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. బుధవారం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించగా రసంలో పురుగులు కనిపించాయి. విద్యార్థినులతో పాటు ఓ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి భోజనం తినగా అతడికి వడ్డించిన భోజనంతో పాటు రసంలో పురుగులు కన్పించాయి. రెండు రోజుల క్రితం పాఠశాలలో ఉదయం పూట ఉప్మా, పొంగల్ వండి పెట్టారు. రెండింటిలో కూడా పెద్దపాటి పురుగులు కన్పించాయి. దీనిపై విద్యార్థినులు ప్రశ్నించగా పెట్టింది తిని చచ్చి చదువుకోండని సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విద్యార్థినుల తల్లిదండ్రులు చెబుతున్నారు. పాఠశాలలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంటు చెడిపోయి నిరుపయోగంగా ఉంది. రెండేళ్లుగా అలాగే ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో బోరులో నుంచి నేరుగా నీటి తొట్టెలోకి నీరు పట్టి అక్కడి నుంచి మోటార్ ద్వారా ట్యాంకుకు పడుతున్నారు. ట్యాంకు నుంచి కుళాయిలో వస్తున్న నీటిని పట్టుకుని తాగుతున్నారు. నీటి తొట్టెను పరిశీలించగా అందులో బల్లులు దర్శనమిచ్చాయి. అలాగే ట్యాంకు కూడా పాచిపట్టడంతో ఈ నీటిని తాగుతూ అనారోగ్యాలకు గురవుతున్నారు.

అనారోగ్యం పాలవుతున్న విద్యార్థినులు

పురుగుల వంటకాలతో పాటు కలుషిత నీరు తాగుతూ విద్యార్థినులకు తరచూ వాంతులు, విరేచనాలు అవుతున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం పురుగుల అల్పాహారం, భోజనం తిన్న ఓ విద్యార్థినికి రక్తపు విరేచనాలతో పాటు వాంతులు కావడంతో భయపడి ఇంటికి వెళ్లింది. అలాగే పలువురు విద్యార్థినులకు కూడా వాంతులు, విరేచనాలు అయ్యాయి. ఇక్కడ పెట్టే పురుగుల వంటకాలు తినలేకపోతున్నాని ములకలచెరువుకు చెందిన సంధ్య అనే విద్యార్థిని తన తండ్రి కోటప్ప ముందు విలపించడంతో ఆయన తన కుమార్తెను ఇంటికి పిలుచుకెళ్లాడు. అలాగే కాలువపల్లె పంచాయతీ బుద్దలవారిపల్లెకు చెందిన వృద్ధుడు రామకృష్ణ ఇక్కడ చదువుతున్న తన మనవరాలు శ్రీలక్ష్మి టీసీ తీసుకెళ్లేందుకు బుధవారం పాఠశాలకు వచ్చాడు. ఎందుకు టీసీ తీసుకెళ్తున్నారని అడగ్గా నా మనవరాలు ఇక్కడ ఉండలేకపోతోందని, భోజనం తింటే వాంతులు వస్తున్నాయని చెబుతోందని సమాధానం చెప్పాడు. ఇలా పలువురు విద్యార్థులు నెల రోజులుగా అనారోగ్యానికి గురై ఇంటిబాట పట్టారు. సంబంధిత ఉన్నతాధికారులు తక్షణం స్పందించి విద్యార్థినులకు పురుగుల వంటకాలు వడ్డించకుండా చర్యలు తీసుకోవడంతో పాటు మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆలస్యంగా మధ్యాహ్న భోజనం

విద్యార్థినులకు బుధవారం ఆలస్యంగా మధ్యాహ్న భోజనం వడ్డించారు. టీచర్స్ డే సందర్భంగా పాఠశాలలో కార్యక్రమాలు చేపట్టడంతో మధ్యాహ్న భోజనాన్ని ఆలస్యంగా వడ్డించారు. మధ్యాహ్నం 12.15 గంటలకు వడ్డించాల్సిన భోజనం 1.20 గంటలకు పెట్టడం ప్రారంభించారు. అందరు విద్యార్థినులకు వడ్డించే సరికి 1.40 గంటలైంది. దీంతో 6, 7వ తరగతి విద్యార్థినులు ఇబ్బందులు పడ్డారు. కాగా పాఠశాలలో ప్రతిరోజూ అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజనాల వడ్డింపులో ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది.



మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థినులు



నిరుపయోగంగా ఉన్న మినరల్ ప్లాంటు

నా కూతుర్ని ఇంటికి తీసుకెళ్లాను..



పురుగుల వంటకాలు తినలేక నా కూతురు సంధ్య తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఇటీవల చూసేందుకు వెళితే ఈ వంటకాలు తినలేనని, ఇంటికి వచ్చేస్తానని భోరున ఏడ్చింది. దీంతో ఇంటికి పిలుచుకెళ్లాను. పాఠశాలలో నెలకొన్న పరిస్థితులు కుదుట పడేదాకా నా కూతురును పాఠశాలకు పంపను. పురుగులు పట్టిన వంటకాల గురించి ప్రశ్నిస్తే తిని చావండి... మీ ప్రతిభ చదువులో చూపించండి అని సిబ్బంది భయపెడుతున్నట్లు నా కూతురు చెప్పింది.

- కోటప్ప, విద్యార్థిని తండ్రి, ములకలచెరువు

విచారించి చర్యలు తీసుకుంటాం..

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఉన్న సమస్యలు నా దృష్టికి వచ్చాయి. వాటిపై విచారించి చర్యలు తీసుకుంటాము. గురువారం పాఠశాలను సందర్శించి సమస్యలపై వివరాలు సేకరిస్తాము. ఆ నివేదికలను ఉన్నతాధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. బాధ్యులు ఎవరైనా ఉంటే వారిపై చర్యలకు సిఫార్సు చేస్తాం.

- వెంకటరమణ, ఎంఈవో, ములకలచెరువు

ఏఎస్పీగా రాజశేఖర్‌రాజు బాధ్యతల స్వీకరణ

రాయచోటి టౌన్, సెప్టెంబరు 4: జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఎస్ ఆర్ రాజశేఖర్‌రాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లాలో అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తిస్తూ బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీగా వచ్చారు. బుధవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సూచనల మేరకు పోలీసు సిబ్బందికి సంబంధించి పెండింగ్ ఫైళ్లను వేగంగా పరిష్కరిస్తామని, శాంతిభద్రతల విషయంలో ఎటువంటి సమస్యలు తలెత్తినా తగిన చర్యలు చేపడతామన్నారు. పరిపాలనాపరంగా కార్యాలయంలో ఉద్యోగరీత్యా ఎటువంటి సమస్య ఉన్నా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి సిబ్బంది సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని, సిబ్బంది, వారి కుటుంబ సంక్షేమంపై దృష్టి సారిస్తామని తెలిపారు. ఈయన గతంలో కడప, కర్నూలు ఉమ్మడి జిల్లాల్లో ఎస్ఐగా, సీఐగా, డీఎస్పీగా పని చేసి సమర్థవంతమైన అధికారిగా, ముఖ్యంగా ఫ్యాక్షన్ అణచివేతలో పేరున్న అధికారిగా అటు ఉన్నతాధికారులతో పాటు ప్రజల మన్ననలు పొందారు. ఏఎస్పీ బాధ్యతలు చేపట్టిన అనంతరం పలువురు పోలీసు అధికారులతో పాటు జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం

- వీరబల్లి వాసి నాగరాజు ప్రతిభ

వీరబల్లి, సెప్టెంబరు 4: నేపాల్‌లో ఆగస్టు 31 నుంచి ఈనెల 4వ తేదీ వరకు జరిగిన అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీ ల్లో వీరబల్లి మండలం కల్లేవాండ్లపల్లెకు చెందిన కొర్లకుంట నాగరాజు గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ పోటీల్లో 74వ విభాగంలో 390 కేజీల బరువు ఎత్తే విధంగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నేపాల్, ఇండియా, భూటాన్, శ్రీలంక దేశాలకు చెందిన 350 మంది వెయిల్ లిఫ్టర్లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సంయుక్త భారతీయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన నాగరాజుకు ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి శివతివార్య చేతుల మీదుగా బహుమతితో పాటు గోల్డ్‌మెడల్ అందజేశారు.



జిల్లాలో చౌక దుకాణాల క్రమబద్ధీకరణ

- మరో వంద షాపుల వరకూ కొత్తగా పెరిగే అవకాశం?

కలికిరి, సెప్టెంబరు 4: జిల్లాలోని చౌక దుకాణాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో దాదాపు మరో వంద చౌక దుకాణాలు జిల్లాలో అదనంగా ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చౌక దుకాణాలు అసంబద్ధంగా ఉన్నాయని, ఈ దుకాణాలన్నింటినీ క్రమబద్ధీకరించి ఒక నిర్ణీత విధానంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. కొన్ని గ్రామాల్లో అవసరానికి మించి ఉండటం, మరి కొన్ని గ్రామాల్లో అసలే దుకాణాలు లేకపోవడం, కొన్ని దుకాణాలకు వేల సంఖ్యలో కార్డుదారులుండటం, మరికొన్ని దుకాణాల్లో కనీసం నెలనెలా నిర్వహణ ఖర్చులు కూడా రాబట్టుకోలేనంత తక్కువగా కార్డులున్నట్లు ప్రభుత్వం తేల్చింది. అలాగే కొన్నిచోట్ల కార్డుదారులు కిలోమీటర్ల దూరంతో చౌక దుకాణాలకు అందుబాటులో లేకుండా వుండటాన్ని కూడా గమనించి దుకాణాలను క్రమబద్ధీకరించాలన్న నిర్ణయానికి వచ్చింది.

జిల్లాలో అదనంగా వంద షాపులు?

జిల్లాలో ప్రస్తుతం అంత్యోదయ కార్డులతో కలుపుకుని 5,04,800 రేషన్ కార్డులున్నాయి. వీటి కోసం జిల్లాలో మొత్తం 1123 చౌక దుకాణాలున్నాయి. మున్సిపాలిటీల వరకు చూస్తే రాయచోటిలో 50 (36 వేల కార్డులు), రాజంపేటలో 48 (28,700 కార్డులు) దుకాణాలుండగా మదనపల్లెలో 101 (63,300 కార్డులు) చౌక దుకాణాలున్నాయి. తాజా మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని మొత్తం 1123 చౌక దుకాణాలను క్రమబద్ధీకరిస్తే దాదాపు వంద వరకూ కొత్త దుకాణాలు ఏర్పాటయ్యే అవకాశాలున్నట్లు చెబుతున్నారు.

రైతన్నలూ.. తస్మాత్ జాగ్రత్త

- విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ముప్పు
- మోటార్లు, స్టార్టర్ల వద్ద జర భద్రం
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ప్రమాదం

మైలవరం, సెప్టెంబరు 4: ఖరీఫ్ పంటలు ప్రారంభం కావడంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. విత్తనం చల్లిన నాటి నుంచి ఇంటికి పంట ఉత్పత్తులు వచ్చే వరకు పొలాలలోనే రైతులు ఎక్కువ సమయం గడు పుతుంటారు. చాలా గ్రామాలలో రైతులు విద్యుత్ మోటార్లపై ఆధారపడి వివిధ రకాల పంటలు పండిస్తు న్నారు. దీంతో తెల్లవారితే చాలు విద్యుత్ తీగలు, మోటార్ల మధ్యనే పనులు చేస్తూ తిరుగుతుంటారు. ఇక చాలా మంది రైతు లు చిన్నచిన్న విద్యుత్ మరమ్మతు పనులు స్వయంగా చేస్తుంటారు. ఇటువంటి సందర్భాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో మృత్యు వాత పడుతున్నారు. పంట పొలాల్లో స్తంభాల నుంచి కిందకు వేలా డుతున్న తీగల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి.



వేలాడుతున్న విద్యుత్ తీగలతో..

వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభాలు దూరంగా ఉన్న ప్రదేశాల్లో కొందరు రైతులు కర్ర స్తంభాలను తాత్కా లికంగా నాటి.. వాటి ద్వారా తీగలు లాగుతుంటారు. ఇవి గాలులు, వర్షాలకు కింద పడి పోతుంటాయి. వాటిని గమనించని రైతులు పనుల్లో నిమగ్నమై తీగలకు తగిలి ప్రమాదాల బారిన పడుతుంటారు. పంట ఉత్పత్తులు ఇంటికి రాగానే పొలం నుంచి విద్యుత్ తీగలు కట్టకట్టి ఇంట్లో భద్రపరుస్తారు. వాటిని కొన్నిసార్లు ఎలుకలు కొరికి వేస్తుంటాయి. అయితే అటువంటి తీగలను పరిశీలించ కుండా తిరిగి మోటార్లకు అమర్చడం వల్ల కూడా ప్రమా దాలు జరిగే అవకాశం ఉంది.



ఇనుప డబ్బాలతో....

స్టార్లర్లు, ఫీజులు బిగించడానికి చాలా మంది రైతులు ఇప్పటికి ఇను ప డబ్బాలు ఉపయో గిస్తున్నారు. ఎలుకలు తీగలను కొరకడంతో డబ్బాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఇది తెలియక రైతులు డబ్బాలను తాకగానే విద్యుత్ ఘాతానికి గురవు తుంటారు. కొంత మంది రైతులు డబ్బాలకు తలుపులు కూడా వేయరు. దీంతో వర్షపు నీరు డబ్బా లలోకి చేరి విద్యుత్ ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటుంది.

కవర్లు లేని మోటార్లతో...

చాలా మంది రైతులు మోటార్లను వంక ఒడ్డున, నేల, బావుల పక్కన ఉంచి చిన్న చిన్న కవర్లు కప్పి సాగు నీటికి వినియోగిస్తుంటారు. అవి కొన్ని రోజులకు దెబ్బతింటాయి. తర్వాత వాటిని పట్టించుకోక పోవడంతో మోటార్లతో ప్రమాదం పొంచి ఉంటుంది. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



మోటారు పనిచేయకపోతే చేతితో దానిని ముట్టుకోరాదు. టెస్టర్ సహా యంతో పరీక్షించాలి. ఎర్తింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. వర్షం నీరు చేరని చోట మోటారును భద్రపరుచు కోవాలి. మోటారు పనిచేయని పక్షంలో విద్యుత్ సరఫరా నిలిపిన తర్వాతే దానిని ముట్టు కోవాలి. ఎప్పటికప్పుడు మోటారు వద్ద తీగలను పరిశీలిస్తుండాలి.

శాస్త్రోక్తంగా కోదండరామునికి పవిత్ర ప్రతిష్ఠ



హోమగుండంలో పవిత్ర ప్రతిష్ఠ చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 4: కోదండరామాలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా మొద టిరోజు బుధవారం పవిత్రాలను హోమగుండంలో ఉంచి పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని టీటీడీ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీటీడీ ఆగమశాస్త్ర అర్చకులు రాజేష్‌బ ట్టర్ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం స్వామి వారికి నిత్య కైంకర్యాలు నిర్వహించి అనంతరం యాగశాలలో హోమగుండాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారి పవిత్రాలకు ఆగమశాస్త్ర ప్రకారం అర్చకులు పూజలు నిర్వహించారు. స్వామి వారి నిత్య కైంకర్యాల్లో ఆటంకాలు తొలగాలని 101 నూలిపోగు ధరించి స్వామివారి అను గ్రహం కలగాలని అర్చకులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు వీణారాఘవాచార్యులు, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, టీటీడీ ఇన్‌స్పె క్టర్ నవీర్, అర్చకులు పాల్గొన్నారు.

హుండీల లెక్కింపుతో గండికి రూ.36లక్షల ఆదాయం



హుండీల లెక్కింపును పరిశీలిస్తున్న అధికారులు

చక్రాయపేట, సెప్టెంబరు 4: గండి క్షేత్రంలో బుధవారం ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో దేవదాయశాఖ సూపరింటెండెంట్ జి.రమణమ్మ అధ్య క్షతన హుండీల లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపుతో రూ.36,48,364 ఆదాయం వచ్చిం ది. అన్నప్రసాద వితరణ హుండీ ద్వారా రూ.66,317 వచ్చింది. 17గ్రాముల మిక్స్‌డు బంగారం, 2కేజీల వెండి వచ్చినట్లు తెలిపారు. 55 రోజులకు గాను ఈ లెక్కింపు నిర్వహించామన్నారు. ఆర్కేవ్యాలీ ఎస్‌ఐ, సిబ్బంది భాస్కర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, బ్యాంకుమేనేజర్ భానుప్రకాష్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో కడప పోలీసు సేవలు



మహిళను మోసుకొస్తున్న కడప పోలీసులు

కడప, క్రైం సెప్టెంబరు 4: విజయవాడ బాధితులను కడప పోలీసులు రక్షిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా విజయవాడ నీటితో అతలాకుతలమైన విషయం తెలిసిందే. వేలాది మంది వరదల్లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో స్పందించిన కడప ఎస్పీ ఆదేశాలతో బాధితులను రక్షించేందుకు కడప నుంచి కొందరు పోలీసు అధికారులతో పాటు ఫైర్ సిబ్బంది వెళ్లారు. కడప చిన్నచౌక్ ఎస్‌ఐ రాజరాజేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం నీళ్లలో చిక్కుకున్న వారిని రక్షించే చర్యలు చేపట్టారు.

అనుమానాస్పద మృతిపై విచారణ

- పోలీసుల అదుపులో 14 మంది జూదగాళ్లు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 4: జూదం ఆడటానికి వచ్చిన అనంతపురం జిల్లా యాడికి గ్రామవాసి కంబగిరి రాముడు (38) ప్రొద్దుటూరులో అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందాడు. దీనిపై ఇతని భార్య ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ బాలమద్దిలేటి ఎస్‌ఐ మహ్మద్ రఫీలు విచారణ చేపట్టారు. అందులో భాగంగా మండల పరిధిలోని కల్లూరు గ్రామ సమీపంలోని పెన్నానది ఒడ్డున రిజర్వ్ ఫారెస్టు స్థలంలో రాముడుతో పాటు మరో వ్యక్తి కారులో జూదం ఆడటా నికి వచ్చినట్లు గుర్తించారు. రాముడుతో పాటు వచ్చిన మరో వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలంలో రాముడు మృతదే హంతో పాటు కారు ఉన్నట్లు గుర్తించారు. రాముడు మృతదేహంపై ఎటువంటి గాయాలు లేకపోవడంపై మృతికి గల కారణాలపై మిస్టరీ నెలకొంది. డాగ్ స్క్వాడ్‌తో కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. గత కొంతకాలంగా వైసీపీ నాయకుడు రేగల్లపల్లె వాసి సానెపల్లె ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పేకాట పెద్దఎత్తున జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మంగళ వారం జరిగిన పేకాటలో దాదాపు 15మంది వరకు పాల్గొన్నట్లు సమా చారం. ఈ విచారణలో పేకాట నిర్వా హకులను పోలీసులు నిర్ధారించుకు న్నారు. వారిని బుధవారం అదుపు లోకి తీసుకుని రూరల్ పోలీసు స్టేషన్‌లో విచారిస్తున్నట్లు సమాచారం. పేకాట సందర్భంగా ఏదైనా గొడవ జరిగిందా.. మరేమైనా జరిగిందా అనే దానిపై లోతుగా పేకాట రాయుళ్లను విచారిస్తున్నారు. అక్కడ నిర్వ హించే పేకాటకు ఎక్కడెక్కడి నుంచి వస్తున్నారు. ఎంత మేరకు అక్కడ జూదం జరుగుతోంది.. ఎవరి ఆధ్వర్యలో జరుగుతోంది.. ఎంతకాలంగా సాగుతోంది. అని కూపీ లాగుతున్నారు. అలాగే ఈ అనుమానాస్పద మృతి వెనుక ఏదైనా కుట్ర దాగివుందా అనే కోణంలో పోలీసులు విచా రణ చేస్తున్నారు. ఏదైమైనా ప్రొద్దుటూరురూరల్ పరిధిలో ఇంకా జూదం సాగుతోందన్నది ఈఅను మాదాస్పద మృతితో వెలుగులోకి వచ్చింది. ఇప్పటికైనా పోలీసులు జూదంపై కఠినంగా వ్యవహరిస్తారా లేదా చూడాలి.

టిప్పరు ఢీకొని వృద్ధురాలు మృతి

రాజంపేటటౌన్, సెప్టెంబరు 4: రాజంపేట మండల పరిధిలోని చెర్లోపల్లె వద్ద బుధవారం టిప్పరు ఢీకొన్న సంఘటనలో గాదిరాజు లక్షుమ్మ(75) అక్కడికక్కడే మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. చెర్లోపల్లె గ్రామానికి సమీపంలో కంకర క్రషర్ మిషన్ ఉండడంతో నిత్యం ఈ గ్రామం మీదుగా టిప్పర్లు, ట్రాక్టర్లు వెళుతూ ఉంటాయి. ఈ క్రమంలో లక్షుమ్మ రోడ్డు పక్క నడుచుకుంటూ వెళుతుండగా అతివేగంతో వచ్చిన టిప్పరు వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన లక్షుమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. రాజంపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కడప ప్రకాశ్‌నగర్‌లో చోరీ

- 5 తులాల బంగారు, రూ.లక్ష నగదు అపహరణ

కడప (క్రైం), సెప్టెంబరు 4: కడప నగరం ప్రకాశ్‌నగర్‌లో ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. బంగారం, నగదు అపహరించారు. ఈమేరకు బాధి తుడు రాజారత్నం చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రకాశ్ నగర్‌కు చెందిన రాజరత్నం సొంత పని నిమిత్తం ఇంటికి తాళాలు వేసి మధ్యాహ్నం బయటికి వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చేలోగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. దొంగలు ఇంట్లో ఉన్న 5తులాల బంగారు నగలు, రూ.లక్ష నగదు అప హరించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నారు.

కిడ్నాప్ కేసులో నలుగురు అరెస్ట్



సంబేపల్లె, సెప్టెంబరు 4: రాయచోటి పట్టణం కొత్తపేట రామాపురానికి చెందిన రామచంద్ర కుటుంబ సభ్యుల కిడ్నాప్ కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. వీరిలో తిరుపతికి చెందిన అరుణ్‌కుమార్, యర్రగుంట్లకు చెందిన వరప్రసాద్, శివశంకర్, ఖాదర్‌బాషాను సంబేపల్లె ఎస్‌ఐ భక్తవత్సలం, పోలీసులు శివ శంకర్, నాగేంద్రతో కలిసి బుధవారం రాయచోటి రాజధాని కల్యాణ మండపం వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. రాయచోటి కొత్తపేటకు చెందిన రామచంద్ర బెంగుళూరుకు చెందిన నవీన్‌కు రైస్ పుల్లింగ్ మిష న్‌ను రూ.15 లక్షలకు బేరం చేసుకొని డబ్బులు తీసుకున్నాడు. రైస్ పుల్లింగ్ మిషన్ ఇవ్వకపోగా.. అతనికి డబ్బులు వెనక్కు ఇవ్వలేదు. దీంతో హిందూపురంలో రామచంద్ర అతని కుమారుడు మునికుమార్, అల్లుడు మునిశేఖర్‌ని కిడ్నాప్ చేసి బెంగుళూరుకి తరలించారు. డబ్బులు ఇవ్వాలని హింసించగా రాయచోటిలో ఇస్తానని రామచంద్ర చెప్పడంతో ఆగస్టు 31వ తేదీ కారులో రాయచోటికి వస్తుండగా తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు సెప్టెంబర్ 1వ తేదీ 9 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రామచంద్ర పారిపోయిన రోజున బెంగుళూరులో కొడుకు, అల్లుడిని కూడా కిడ్నాపర్లు వదిలేసినట్లు తెలిపారు. రైస్‌పుల్లింగ్ మిషన్ లాంటి అభూతకల్పనలకు, ప్రలోభాలకు గురై ఇలాంటి కిడ్నాప్ కేసుల్లో చిక్కుకొని భవిష్యత్తును నాశనం చేసుకోవ ద్దని సీఐ తెలిపారు.

గువ్వల చెరువు ఘాట్‌లో మద్యం లారీ బోల్తా

సికెదిన్నె, సెప్టెంబరు 4: గువ్వల చెరువు ఘాట్‌లో మద్యం లారీ బోల్తా పడినట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. రాయచోటివైపు నుంచి కడ పకు వస్తున్న మద్యం లారీ గువ్వల చెరువు ఘాట్ దిగుతుండగా 4వ మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడిందన్నారు. ఈ ఘటనలో ఎటు వంటి ప్రాణనష్టం జరుగలేదని .. మద్యం బాటిళ్లు దెబ్బతిన్నాయన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలి

- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



సిద్దవటం పోలీసు స్టేషన్‌లో పోలీసులతో మాట్లడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

సిద్దవటం, సెప్టెంబరు 4: పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి.. వారి సమ్యలను తెలుసుకుని పరిష్కరిం చాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. బుధవారం సిద్దవటం పోలీసుస్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డు లను పరిశీలించారు. కొత్తగా స్టేషన్లలో బాధ్య తలు చేపట్టిన ఎస్‌ఐలు ఫిర్యాదుదారుల పిటి షన్లను రిజిస్టర్‌లో పరిశీలించి ఎలా పరిష్కరిం చాలో చూడాలని ఆదేశించారు. పిటిషనర్‌కు అనుకూలంగా జరిగిందా లేదా అనే విష యాన్ని పరిశీలించాలన్నారు. పాత నేరస్తులతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి జీవన విధానం, డబ్బు ఎలా సంపాదిస్తున్నారో అడిగి తెలుసుకోవాలన్నారు. నేరాల్లో పాల్గొంటున్నారా లేదా అనే సమాచారాన్ని వారితో మాట్లాడి తెలుసుకోవాలని ఆదేశించారు. వారి కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. ఎస్‌హెచ్‌వోలు జిల్లా పోలీసుశాఖ రూపొందించిన చెక్‌లిస్టు మేరకు ప్రతి కేసుకు సంబం ధించిన వివరాలు సీడీ ఫైల్లో ఉంచి దర్యాప్తు ప్రక్రి య సజావుగా జరిగేలా దర్యాప్తు నైపుణ్యం పెంపొందించుకునేలా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను త్వరగా డిస్పోజ్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. స్టేషను ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశు ధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతిరోజు గ్రామాలకు వెళ్లి రోజులో సగభాగం ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో అసాంఘిక కార్యక్ర మాలకు పాల్పడే వారి కార్యకలాపాలపై నిఘా ఉం చాలని ఆదేశిం చారు. జిల్లా ఎస్పీ వెంట అదనపు ఎస్పీ జి.వెంకటరాముడు, ఒంటి మిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్, సిద్దవటం ఎస్‌ఐ వెంకటనాగ చిరం జీవి, సిబ్బంది ఉన్నారు.

అట్లూరు పోలీసుస్టేషన్‌లో తనిఖీ

అట్లూరు, సెప్టెంబరు 4: అట్లూరు పోలీసుస్టేషన్‌ను బుధవారం కడప ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తనిఖీ చేశారు. స్టేషన్ స్థితిగతుల గురించి ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండే విధంగా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. వినాయక చవితి సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో తిరిగి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఇన్‌చార్జ్ ఎస్‌ఐ కేసీ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేద్దాం : మాజీ సీఎం



మాట్లాడుతున్న మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

రాజంపేట టౌన్, సెప్టెంబరు 4: బీజేపీని నాయకులు, ప్రతి కార్యకర్త కింది స్థాయి నుంచి బలోపేతం చేయడానికి కృషి చేయాలని బీజేపీ నేత, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని న్యూఆంధ్ర కల్యాణమండపంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ దేశంలో ఇద్దరు సభ్యులతో మొదలై నేడు బలమైన పార్టీగా ఎదిగింది అని తెలిపారు. ప్రపం చంలో అత్యధిక సభ్యులు కలిగిన ఏకైక బలమైన పార్టీగా బీజేపీ స్థానం సంపాదించిందని ఆయన తెలిపారు. అయినప్పటికీ దక్షిణ భారతదేశంలో ఇతర రాజకీయ పార్టీలతో కలిసి పోటీ చేసి ప్రభు త్వాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఇక నుంచి అలా కాకుండా స్వయం శక్తిగా పార్టీ సుస్థిర పాలన అందించేలా పార్టీని బలోపేతం చేయాల న్నారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు 45 రోజుల వ్యవధిలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. బీజేపీ అందిస్తున్న పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. మైనార్టీలకు ప్రత్యేకంగా బీజేపీ అభివృద్ధి కాంక్షిస్తున్న వారి ఓటు బ్యాంకు కోల్పోతున్నామని, వారికి ఉన్న అపోహలను తొలగించి ఓటు బ్యాంకు పెంచాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేశ్‌లు మాట్లా డుతూ దేశవ్యాప్తంగా బీజేపీ 10 కోట్లకు పైగా సభ్యత్వ నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారని తెలిపారు. అందులో మన రాష్ట్రంలో ఒక కోటి సభ్యత్వ నమోదు చేసేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. బీజేపీ అధికారంలో ఉంటే దేశం సర్వవిధాల అభి వృద్ధి సాధిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. సమా వేశంలో బీజేపీ నేతలు కృష్ణయాదవ్, సురేష్, చంద్రమౌళి, గోపాల్‌రెడ్డి, కిరణ్ కుమార్, బాలాజీ, రాజంపేట నియోజకవర్గంలోని వివిధ మండలాల నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు.

అత్యుత్తమ పరిశోధన ఫలితాలు రావాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 4: అత్యుత్తమ ప్రమాణాలతో పరిశోధన ప్రాజెక్టులు పూర్తి చేయాలని వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి అన్నారు. రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాధరెడ్డితో కలిసి బుధ వారం పరిశోధకులతో సమావేశం జరిపారు. రాష్ట్రంలో ఏ యూనివర్శిటీకి రాని విధంగా 54 పరిశోధన ప్రాజెక్టులు వైవీ యూకు లభించాయన్నారు. పరిశోధన పత్రాలు ప్రత్యేక జన రల్స్‌లో ప్రచురితం అయ్యేలా చూడాలన్నారు. అనంతరం ప్రాజెక్టు ఫెలోలను నియ మించుకోవాలన్నారు. ప్రాజెక్టులు పొం దిన సైన్స్ ఆర్ట్స్ విభాగ ఆచార్యులు, సహా య సహాచార్యులు పరిశోధన అనుమతి పత్రాలను అందజేశారు.

చిత్రకళ ప్రదర్శనను సందర్శించిన విద్యార్థులు

వైవీయూ ఫైన్ ఆర్ట్స్‌శాఖ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను నగరం లోని పలుపాఠశాలల విద్యార్థులు సందర్శించారు. ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 5 వరకు ప్రదర్శన కొనసాగుతున్న నేప. ధ్యంలో ఆర్ట్స్ గ్యాలరీలో శిల్పకళ, చిత్రకళ డిజైన్లను విద్యార్థులు తిలకించారు. లలిత కళల శాఖ విభాగాధిపతి కోట మృత్యుంజ యరావు విద్యార్థులకు లలిత కళలు గురించి వివరించారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

వేంపల్లె, సెప్టెంబరు 4: జీవితం కోల్పోయేందుకు కారణమయ్యే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త సూచించారు. బుధ వారం డ్రగ్స్ నిషేధంపై ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా డ్రగ్స్ వాడకంతో వారి జీవితాల్లో ఎంత నష్టం వాటి ల్లు తుందో, జీవనశైలి ఎలా దెబ్బతింటుందో వివరించారు. పరి పాలన అధికారి రవికుమార్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్ మధుసూద న్‌రెడ్డి, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మంత్రి ఆనం రామ్‌నారాయణ రెడ్డి రాక

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 4: రాష్ట్ర దేవదాయశాఖ మం త్రి ఆనం రాంనారాయణరెడ్డి ఈ నెల 6న గాలివీడు రామాల యంలో కుంభాబిషేకంలో పాల్గొంటారని సమాచారశాఖ అధికా రులు తెలిపారు. అనంతరం చిత్తూరు జిల్లా కానిపాకం వెళతా రన్నారు. అయన వెంట రాష్ట్ర రోడ్డు రవాణశాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్‌రెడ్డి కూడా వుంటారని తెలిపారు.

పిల్లలందరూ అంగన్వాడీలలో ఉండాలి : కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 4: పిల్లలందరూ అంగన్వాడీ కేంద్రాలలో ఉండే విధంగా చూసుకుని, వారికి విద్యాబుద్ధులు నేర్పించాలని ఐసీడీఎస్ అధికారులను కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూపర్‌వైజర్లు పిల్లల కోసం ప్రత్యేక చొరవ తీసుకొని పిల్లలందరూ అంగన్వాడీ కేంద్రాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నపిల్లలు కాబట్టి వారికి మంచి భోజనం అందించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల హాజరు శాతం తక్కువ కాకుండా పక్కగా నమోదు చేయాలన్నా రు. ప్రతి రోజు ఉదయం ఒక ఫొటో, మధ్యాహ్నం భోజనం చేసేట ప్పుడు మరియు సాయంత్రం ఇంటికి వెళ్లేటప్పుడు ఒక ఫొటో తప్పనిసరిగా యాప్‌లో నమోదు చేయాలన్నారు. అంగన్వాడీ కార్య కర్తలు ఎటువంటి పొరపాట్లు చేసినా వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శశిక ళ, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ భూములు ఆక్రమిస్తే చర్యలు

- జిల్లా దేవదాయ ధర్మాదాయశాఖ అధికారి విశ్వనాథం

గాలివీడు, సెప్టెంబరు 4: జిల్లాలోని దేవదాయ భూములు ఆక్ర మించిన వారిపై చర్యలు తప్పవని జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారి విశ్వనాథం పేర్కొన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని కోదండ రామాలయం, గాలివీటమ్మ ఆల యాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 9761 ఎకరాల దేవదాయ భూములు కలవని, వీటిలో 460 ఎకరాలు సర్వీసర్ల ఆధీనంలో ఉన్నాయని, ఇంకా 5567 ఎకరాల భూమిని గుర్తించాల్సి ఉందన్నారు. 1170 ఎకరాలు భూములు పరాధీనంలో కలవని, 2542 ఎకరాల భూములు సాగుకు లీజుకి ఇచ్చామన్నారు. జిల్లాలో 268 ఆలయాలకు ధూప దీప నైవేద్య పథకం అమలు జరుగుతున్నదని తెలిపారు. దేవా లయ భూముల దురాక్రమణ కాకుండా ప్రజాప్రతినిధులు, భక్తులు కూడా సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. ప్రధానంగా రెవెన్యూశాఖను సమన్వయం చేసుకొని దేవాలయ భూములు గుర్తిస్తామన్నారు. జిల్లాలోని అర్హత కలిగిన ఆలయా లకు ధూప దీప నైవేద్య పథకం అమలుకు చర్యలు చేపడుతున్నా మని తెలిపారు. ఈవో కొండారెడ్డి, పూలుకుంట సర్పంచ్ పార్థసా రధిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డీసీఓను సస్పెండ్ చేయాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 4: జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఎన్నో అరాచకాలు జరుతున్నా వాటి గురించి పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న డీసీఓ మాధవిలతను కలెక్టర్ వెంటనే సస్పెన్షన్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలోని ప్రిన్సిపల్ విద్యార్థులను ఇన్ని ఇబ్బందులు పెడుతున్నా డీసీఓ పర్యవేక్షణ చేసిన పాపానపోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా గురకుల పాఠశాలపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థులకు ధైర్యాన్ని, భరోసా ఇచ్చి పాఠశాలల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.5 వేల విరాళం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 4: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం మోడల్ స్కూల్ కమిటీ చైర్మన్ యనమల మణి, విశ్వనాధలు రూ.5 వేలు విరాళం ప్రకటించారు. ఈ మేరకు నగదును సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇవ్వాలని తహసీల్దారు లక్ష్మీప్రసన్నకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వరద బాధితులు అన్నీ కోల్పోయి వీధిన పడ్డారని, దాతలు ముందుకు వచ్చి బాధితులకు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు క్రిష్ణ, రెడ్డిశేఖర్, ప్రసాదు, మల్లి, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడిగా డాక్టర్ పెంచలయ్య

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 4: అఖిలభారత అంబేడ్కర్ సేన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఫిజియోథెరపీ వైద్యులు పి.పెంచలయ్యను, అఖిలభారత అంబేడ్కర్‌సేన అధ్యక్షుడిగా రాజీవ్‌మేనన్ ద్వారా ఉత్తర్వులు పొందినట్లు తెలిపారు. గతంలో బహుజనుల హక్కుల కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాజ్యోతిరావు పూలే ఆశయాల కోసం బడుగు బలహీనవర్గాల ప్రజల హక్కుల సాధన కోసం కృషి చేశారు. కాగా పలువురు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పూలే ఆశయ సాధకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరద సహాయక చర్యల్లో జిల్లా అధికారులు


విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో శానిటేషన్ పనులను పర్యవేక్షిస్తున్న రాయచోటి మున్సిపల్ అధికారులు, విజయవాడ సితారవీధిలో బాధితులకు వాటర్‌బాటిళ్లు అందిస్తున్న సుండుపల్లె పోలీసులు, పారిశుధ్య పనుల్లో నందలూరు పంచాయతీ సిబ్బంది

రాయచోటిటౌన్, సెప్టెంబరు 4: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రమైన రాయచోటి మున్సిపల్ అధికారులు బుధవారం విజయవాడ నగర పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునలు రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ డిల్లీరావుతో కలిసి విజయవాడ నగరంలోని 16వ డివిజన్ 77వ సచివాలయం పరిధిలో కృష్ణలంక, భూపేష్ గుప్తానగర్ తదితర ప్రాంతాల్లో కలియతిరిగారు. అలాగే వారు ఆయా వరద ప్రాంతాల్లో ప్రత్యేక శానిటేషన్ పర్యవేక్షించడంతో పాటు పాలు, ఆహారం, అత్యవసర మందులు వరద బాధితులకు పంపిణీ చేశారు. తెల్లవారుజాము నుంచే స్థానిక అధికారులతో కలిసి నిర్విరామంగా సహాయక చర్యలను కొనసాగించారు.

సుండుపల్లె: విజయవాడలో వరద బాధితులకు సేవలందించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సుండుపల్లె ఎస్‌ఐ శ్రీనివాసులు సిబ్బంది తరలి వెళ్లారు. విజయవాడలోని సితారవీధిలో వరదల కారణంగా తినేందుకు తిండి, తాగేందుకు నీరు లేని ప్రజలకు ప్రభుత్వం అందించిన ఆహారాన్ని అందజేసినట్లు తెలిపారు. ఎంతో మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ప్రభుత్వం వారిని ఆదుకునేందుకు పంపించడం ఆ సేవలో సుండుపల్లె పోలీసులు పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు రవినాయక్ పాల్గొన్నారు.

నందలూరు: ప్రభుత్వ ఆదేశానుసారం విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సిబ్బంది బుధవారం చేపట్టారు. ఈ పనులను స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, అధికారులతో కలిసి పర్యవేక్షిస్తున్నారు.

కలెక్టర్‌కు మహిళ ఫిర్యాదు

రాజంపేట, సెప్టెంబరు 4: రాజంపేట మండలంలో ఎన్నికలముందు పనిచేసిన తహసీల్దారు తప్పుడు అనుభవ సర్టిఫికెట్లు జారీ చేసి రిజిస్ట్రేషన్లకు పాల్పడ్డారని పేర్కొంటూ రాజంపేటకు చెందిన కన్యకాపరమేశ్వరి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో రాజంపేట ప్రాంతంలో ఓ తహసీల్దారు వందలాది మంది భూమికి సంబంధించిన అనుభవ సర్టిఫికెట్లు జారీ చేసి భారీ ఎత్తున అవినీతి సొమ్ముకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి ఆధారాలను కలెక్టర్‌కు అందజేశారు. దీనిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

'పర్యావరణాన్ని కాపాడుదాం'

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 4: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కమ్యూనిటీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ విజయభాస్కర్ పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లె శ్మశానంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్మశానంలో చాలా స్థలం ఉందని, ఖాళీగా ఉన్న ప్రదేశంలో మొక్కలు నాటాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో దేవదాసు, బసయ్య, రాజా, లక్ష్మిరాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు ప్రత్యేక చర్యలు

గాలివీడు, సెప్టెంబరు 4: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గోరాన్‌చెరువు పంచాయతీ కరిమిరెడ్డిగారిపల్లెకు సమీపంలోని శ్రీలక్ష్మి క్రాకర్స్ గోదామును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి ఇప్పటికే పలు ప్రాంతాల్లో బోర్లు వేశామని, తొందరలో వాటికి మోటార్లు అమర్చి ప్రజలకు తాగునీటి సమస్యను తొలగించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్థసారధిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు రెడ్డిప్రసాద్‌రెడ్డి, ప్రభాకర్‌నాయుడు, మాజీ వక్ఫ్‌బోర్డు మెంబర్ మహబూబ్‌బాషా, టీడీపీ నాయకులు ధర్మారెడ్డి, వెంకట్రమణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగేశ్వరరావు, వీరరాఘవులు, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మెళకువలతో అధిక దిగుబడులు

నందలూరు, సెప్టెంబరు 4: ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులను సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి సుచిత్ర పేర్కొన్నారు. మండలంలోని పాటూరు పంచాయతీ కుమ్మరపల్లెలో జిల్లా వనరుల కేంద్రం అధికారులు బుధవారం పర్యటించి రైతులకు సభ నిర్వహించారు. గ్రామసభలో రైతులకు వరిపంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. అదేవిధంగా కడప కేవీకే కేంద్రం నుంచి వ్యవసాయ శాస్త్రవేత్త వీరయ్య రైతుల వరి పంట పొలాలను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మల్లికార్జున, పాటూరు ఆర్‌బీకే ఎంపీఈవో సాయిప్రియ, కుమ్మరపల్లె గ్రామ రైతులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సెంటర్లకు కందిపప్పు పంపిణీ చేయాలి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 4: జిల్లాలోని ఐసీడీఎస్ అన్ని ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ సెంటర్లకు గత రెండు నెలలుగా గర్భవతులకు, బాలింతలకు, ప్రీస్కూల్ పిల్లలకు కందిపప్పు అందడం లేదని, ప్రభుత్వం వెంటనే సరఫరా చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు బుధవారం ఒక ప్రకటనలో జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్టులో జనవరి నుంచి గర్భవతులకు కందిపప్పు ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సకాలంలో పౌష్టికాహారం పంపిణీ చేయాలన్నారు.

ఆక్రమణలపై ఆర్డీవో విచారణ

సిద్దవటం, సెప్టెంబరు 4: మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామం సర్వేనంబరు 568/5లో 1.05 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికావడంతో కడప ఆర్డీఓ వెంకటపతి విచారణ చేశారు. సదరు ప్రభుత్వ భూమి వివాదాస్పదంగా ఉందని కలెక్టర్‌కు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు అందింది. ఈ మేరకు ఆర్డీఓ విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కాగా ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైతే సహించేది లేదని హెచ్చరించారు.

సోమశిల వెనుకజలాలకు మరోసారి గండి


పైపులైను దెబ్బతినడంతే చెరువుకు ఆగిన నీరు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 4: మండలంలోని రైతులకు ఆశాజ్యోతి ఒంటిమిట్ట చెరువుకు నీరందించే పైపులైనుకు బుధవారం ఉదయం మరోసారి బండారుపల్లె సమీపంలో పైపులైను దెబ్బతిని గండిపడింది. 2016లో కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన నాసిరకం పైపులతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పైపులైను పులివెందుల నుంచి తీసుకువచ్చారని, 24 గంటల వ్యవధిలో మరమ్మతులు చేపట్టి గురువారం సాయంత్రం మరోమారు చెరువుకు నీరు అందిస్తామని ఇరిగేషన్ డీఈ వాసుదేవరెడ్డి తెలిపారు. రైతులకు పంటలు ఎండిపోవడం ప్రత్యక్షంగా చూశామని, వారితోపాటు రామాలయానికి వచ్చే ఇబ్బందులను దగ్గరుండి చూసిన వ్యక్తులుగా తమ ఛాలెంజ్‌గా తీసుకుని చెరువుకు నీరందించే ఏర్పాట్లను ఇరిగేషన్‌శాఖ తరపున చేపడతానన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం


కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్, ఎన్డీయే నాయకులు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 4: మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయం బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ యువనేత ముక్కా సాయివికాస్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, యువ నాయకులు గోవర్ధన్‌రెడ్డిలు హాజరై కార్యాలయం ప్రారంభించారు. నియోజకవర్గంలో రోజు రోజుకు బీజేపీకి ఆదరణ పెరుగుతున్న సందర్భంగా మండలంలో పార్టీ కార్యకలాపాల కోసం, రాష్ట్ర పెద్దల ఆదేశాల మేరకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని కూటమి పార్టీల నాయకులు, అభిమానులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాకు పట్టాలివ్వండి

● కలెక్టర్‌కు తొగూరుపేట వాసుల వినతి

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 4: రాజంపేట మండలం తొగూరుపేట పంచాయతీలో వుండే బుగ్గిడిపల్లి, చింతకోన, ఏకిలపల్లి వాసులకు పట్టాలివ్వాలని కలెక్టర్ శ్రీధర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్వే నెంబరు 707లో పూర్వం తమ తాతల కాలం నుంచి భూములు సాగు చేసుకుంటున్నామని, ఆ భూములు ఎవరి ఆక్రమణలో లేవన్నారు. ఇదే విషయంపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన సుండుపల్లి నాయకులు రాం శ్రీనివాస్, వెంకట్రమణ, సుబ్బరాయుడు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద తొలగించారు


కుక్కలను ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న మున్సిపల్ సిబ్బంది

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 4: లక్కిరెడ్డిపల్లెలో మొన్నటి వరకు కుక్కలంటే గ్రామ ప్రజలు బెంబేలెత్తిపోయేవారు. ప్రతి వీధిలో 15 నుంచి 20 కుక్కలు ఉండేవి. తెల్లవారితే కుక్కల భయంతో మండలవాసులు ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలోనే 10 రోజుల కిందట దాదాపు 20 మందిని కరవడంతో వారంతా గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందిన విషయమే. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు బుధవారం పంచాయతీ అధికారులు రంగంలోకి దిగి కుక్కలను పట్టుకొని దూర ప్రాంతాలకు తరలించారు. దీంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

నామమాత్రంగా మండల సర్వసభ్య సమావేశం

● మొక్కుబడిగా హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు


సమావేశం జరుగుతుండగా ఖాళీ కుర్చీలతో కనపడుతున్న దృశ్యం

ఒంటిమిట్ట, సెప్టెంబరు 4: మండల సర్వసభ్య సమావేశాన్ని అధికారులు మొక్కుబడిగా నిర్వహించారు. ఎంపీపీ అక్కి లక్ష్మీదేవి అధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో రెడ్డయ్య నిర్వహించారు. గత నెల 26న నిర్వహించిన సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. వెంటనే మరోసారి బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మొక్కుబడిగా హాజరు పట్టికలో సంతకాలు పెట్టి వెంటనే సమావేశం నుంచి తిరిగి వెళ్లిపోయారు. మండలంలోని సమస్యలను చర్చించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు తమకు తోచిన విధంగా మొక్కుబడిగా మండల సమావేశాన్ని ముగించారు. కాగా సమావేశం జరుగుతుండగానే ప్రజా ప్రతినిధులు మొత్తం సమావేశం నుంచి వెళ్లిపోవడం, ఖాళీ కుర్చీలు కనపడడం, అధికారులు కూడా అన్నిశాఖలకు సంబంధించిన వారు హాజరు కాకపోవడం, అధికారుల వైఖరిపై తీవ్ర విమర్శలు నెలకొన్నాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రమణమ్మ, ఈవోపీఆర్డీ రంగయ్య, డాక్టర్ హిమశ్వేత, వెటర్నరి ఏడీ ఉమా, ఏపీవో శివశంకర్‌రెడ్డి, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలి

● కడప జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్


న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జీ బాబాఫకృద్దీన్

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 4: వసతి గృహాల్లో, బాలికల పాఠశాలలో అఘాయిత్యాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కడప జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జిల్లా న్యాయసేవాధికారి సంస్థ అధినేత బాబా ఫకృద్దీన్ పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లె అంబేద్కర్ గురుకల పాఠశాలలో రెండు రోజుల కిందట పదేళ్ల బాలికపై ప్రిన్సిపల్ భర్త లైంగిక వేధింపులకు గురిచేసిన విషయం తెలుసుకుని బుధవారం స్థానిక అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించడమే కాకుండా, ధైర్యం చెప్పాలని సూచించారు. అదేవిధంగా గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లలకు అన్యాయం జరిగినప్పుడు వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్లు 100, 1098, 15, 100కు ఫోన్ చేసి రక్షణ పొందాలన్నారు. ఆడపిల్లలు బాగా చదువుకొని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, అన్ని రంగాల్లో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె కోర్టు సివిల్ జడ్జీ షేక్ ఫైజున్నిసా, సీఐ వెంకట కొండారెడ్డి, ఎస్‌ఐ రవీంద్రబాబు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

కలెక్టర్ దృష్టికి రైల్వేకోడూరు సమస్యలు


కలెక్టర్ శ్రీధర్‌ను సత్కరిస్తున్న నరసింహప్రసాద్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 4: కలెక్టర్ చామకూరి శ్రీధర్ దృష్టికి రైల్వేకోడూరు నియోజకవర్గ సమస్యలు తీసుకెళ్లినట్లు టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. బుధవారం రాయచోటిలో కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గ వ్యాప్తంగా జరగాల్సిన అభివృద్ధి పనులు వేగవంతంగా సాగాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. గుంజననదికి రక్షణగోడ, సీసీ రోడ్లు, చెరువు కట్ట పనులు, పెనగలూరు సోమశిల బ్యాక్ వాటర్ లిఫ్ట్ ఇరిగేషన్, మూతపడిన అనంతరాజుపేట అప్పా జ్యూస్ పరిశ్రమ, పెండింగ్‌లో ఉన్న కోడూరు-వెంకటగిరి రోడ్డు, రైతులకు శీతల గిడ్డంగులు తదితర చేయాల్సిన పనులను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కలెక్టర్ ద్వారా జరగాల్సిన పనులను వెంటనే చేసేందుకు సానుకూలంగా స్పందన వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతాయని తెలిపారు. అనంతరం కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు.

ఆర్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

● లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 4: (రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఆర్‌బీఐ 90 క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట ఉద్యాన కళాశాలను సందర్శించి ఆర్‌బీఐ90 క్విజ్ పోటీల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీఐ90 క్విజ్ పోటీలకు ఎలా రిజిస్ట్రేషన్ చేయాలనే విషయాన్ని కళాశాలలో ఆచార్యులు, అడ్మినిస్ట్రేషన్ అధికారులకు తెలిపారు. ఈ నెల 15 వరకు రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం ఉందన్నారు. పోటీల్లో విజేతలైన వారికి మొదటి బహుమతిగా రూ.10 లక్షలు, రెండోవ బహుమతిగా రూ.8 లక్షలు, మూడవ బహుమతిగా రూ.6 లక్షలు ఇస్తారన్నారు. ఆర్‌బీఐ ఏర్పడి 90 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా క్విజ్ పోటీలు పెడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన కళాశాల ఆచార్యులు సదరున్నిసా తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో వనమహోత్సవం


గురుకులంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో

రామాపురం, సెప్టెంబరు 4: స్థానిక అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఇందులో భాగంగా బుధవారం 100 మామిడి, ఉసిరి, సపోట, నేరేడు లాంటి పండ్ల రకాలు, వేప, చింత, కానుగతో పాటు పూల రకాల మొక్కలను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మురళీధర్‌రాజు, ఉపాధ్యాయులు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

● రెవెన్యూ కార్యాలయం ఎదుట సీపీఐ నేతల ధర్నా

రైల్వేకోడూరు, సెప్టెంబరు 4: నిరుపేదలకు రేషన్‌కార్డులు మంజూరు చేయాలని నియోజకవర్గ సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణిలు తెలిపారు. ఈ మేరకు బుధవారం రైల్వేకోడూరు రెవెన్యూశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్‌కార్డులు లేక నిరుపేదలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రేషన్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేద కుటుంబానికి రెండు ఎకరాల చెప్పున బంజరు భూములు ఇవ్వాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్, సహాయ కార్యదర్శి మొగిలి వినయ్, కార్యవర్గ సభ్యులు శెట్టిపల్లి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు స్వచ్ఛంద పదవీ విరమణ

సుండుపల్లె, సెప్టెంబరు 4: ఉపాధ్యాయురాలు వీరనాగమ్మ స్వచ్ఛందంగా పదవీ విరమణ పొందడంతో ఘనంగా సన్మానించినట్లు ఎంఈఓ వెంకటేశ్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోని ఎగువ గుల్లావాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేసే వీరనాగమ్మ 35 ఏళ్ల పాటు సుదీర్ఘ ఉద్యోగం జీవితంలో బాధ్యతాయుతగా పనిచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జయన్న, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు నాగరాజునాయక్, ఎస్‌టీయూ మండల మండల అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు హరికుమార్, అశోక్‌రాజు, ఆంజనేయులు, సీఆర్‌పీ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు రేపు ఇంటర్వ్యూలు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 4: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 6న డిక్షన్ కంపెనీలో ఉద్యోగాలకు యువతీ, యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరిక్రిష్ణ, ట్రస్ట్ చైర్మన్ పార్థసారథిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు బుధవారం మాట్లాడుతూ పట్టణంలోని గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ కార్యాలయంలో తిరుపతికి చెందిన డిక్షన్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ అర్హత కల్గిన నిరుద్యోగ, యువతీ, యువకులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 7093618420, 7799527687, 8897776368 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పౌష్టికాహారం.. తల్లి బిడ్డకు ఆరోగ్యం

సుండుపల్లె, సెప్టెంబరు 4: గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవడం వలన తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని ఎంపీహెచ్‌ఈవో వీరనారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషణ మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీల్లో అందించే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవడం వలన రక్తహీనతను నివారించవచ్చని, గర్భవతులుగా ఉన్నప్పుడు మూడు వారాల్లోపు ఖచ్చితంగా ఆరోగ్య కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం నాగరత్నమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు సుజాత పాల్గొన్నారు.

రేపు జడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 4: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో గ్లోరియా ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీటీసీలు పాల్గొనే ఈ సమావేశానికి జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.15 కోట్లు



హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 4: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,15,81,533 వచ్చింది. ఆస్థాన మండపంలో ఈవో గురుప్రసాద్ పర్యవేక్షణలో స్వామి హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. 49 గ్రాముల బంగారు, 1.30 కేజీల వెండి, 602 యూఎస్ఏ, 20 ఆస్ట్రేలియా, 2 సింగపూర్ డాలర్లు లభించాయి. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.7,940, నిత్యాన్నదాన సత్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.24,025 సమకూరాయి. ఈ ఆదాయం పూర్తిగా 18 రోజులలో లభించింది.

ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

19 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్సు సిబ్బంది

మంగళం, సెప్టెంబరు 4: సత్యవేడు అటవీ ప్రాంతంలో బుధవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసి, 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఆర్ఐ చిరంజీవికి చెందిన ఆర్ఎస్ఐ ఎం.మురళీధర్‌రెడ్డి బృందం మంగళవారం సత్యవేడు సమీపంలో బీరకుప్పం సెక్షన్ ఎస్‌కే మడుగు వద్ద కూంబింగ్ చేపట్టారు. బుధవారం ఉదయం భూపతేశ్వర కోన వద్ద స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ టాస్క్‌ఫోర్సు పోలీసులకు కనిపించారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, దుంగలు కింద పడేసి పారిపోయారు. అయితే పోలీసులు ఇద్దరిని పట్టుకోగలిగారు. వారు నాగలాపురానికి చెందిన వ్యక్తులుగా గుర్తించి, తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాల్లో అదనపు ట్రిప్పులు తిప్పుతాం



అదనపుఈవో వెంకయ్య చౌదరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీపీటీవో చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 4: త్వరలో ప్రారంభం కానున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆర్టీసీ బస్సుల ద్వారా అదనపు ట్రిప్పులు తిప్పుతామని ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి వివరించారు. బుధవారం ఆయన తిరుమలలో అదనపుఈవోను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువకప్పి సత్కరించారు. అనంతరం చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం కనుమదారిలో మొత్తం 410 బస్సులు నడుపుతున్నామని, రోజుకు దాదాపు 1500 ట్రిప్పులు తిరుగుతాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో అదే బస్సుల సంఖ్యతో అదనంగా 500 ట్రిప్పులు తిరిగేలా చర్యలు చేపట్టామన్నారు. గరుడ సేవకు 3వేల ట్రిప్పులు తిరిగేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అదనపు సిబ్బందిని కూడా రప్పిస్తున్నామన్నారు. గతంలో మాదిరిగా పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కోరారు. అదనపు ఈవో స్పందిస్తూ.. పోలీసు, విజిలెన్స్ విభాగాలతో సమన్వయం చేసుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరుమల డిపో మేనేజర్ విశ్వనాథం కూడా పాల్గొన్నారు.

అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు ది బెస్ట్ ఎంప్లాయిబిలిటీ ఇన్షియేటివ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రవికుమార్, సతీష్ రాళ్లపల్లి

రేణిగుంట, సెప్టెంబరు 4: అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ది బెస్ట్ ఎంప్లాయిబిలిటీ ఇన్షియేటివ్ అవార్డు దక్కించు కుంది. బుధవారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో జియాంగ్గీ బిజినెస్ సెంటర్ డైరెక్టర్ జాంటీ జంగ్, కంబోడియా కాన్సులేట్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, యాసి దారివాల్ చేతుల మీదుగా జాతీయ హెచ్ఆర్ ఎక్సలెన్స్ అవార్డును అమరరాజా ఫౌండేషన్ సభ్యులు అందు కున్నారు. యువతలో నైపుణ్యం, విజ్ఞానం పెంపొందించి మెరుగైన జీవనోపాధి అవకాశాలను అందిస్తున్నందుకు ఈ లభించినట్లు ప్రకటించారు.

విజిలెన్సు ఎస్పీగా కరీముల్లా షరీఫ్



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 4: తిరుపతి విజిలెన్సు ఎస్పీగా విజయవాడలో పనిచేస్తున్న కరీముల్లా షరీఫ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన తిరుపతిలో ఇన్‌చార్జి ఎస్పీగా పనిచేస్తున్నారు. 2010 బ్యాచ్‌కు చెందిన కరీముల్లా షరీఫ్ అనంతపురం జిల్లా కదిరి డీఎస్పీగా పని చేశాక గ్రేహౌండ్స్‌కు బదిలీ అయ్యారు.తర్వాత కడప జిల్లా మైదుకూరు,అనంతపురం జిల్లా పెనుకొండల్లో డీఎస్పీగా పనిచేసిన ఆయన సీఐడీకి బదిలీ అయ్యారు.2018లో అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం ఇంటెలిజెన్సు విభాగానికి బదిలీ చేసింది. అనంతరం పశ్చిమ గోదావరి సెబ్ అదనపు ఎస్పీగా నియమించింది. తరువాత విజయవాడ ఇంటెలిజెన్సు విభాగానికి బదిలీ చేసారు. 2023లో ఎస్పీగా పదోన్నతిపై విజయవాడలోని విజిలెన్సు విభాగంలో ఎనిమిది నెలలు పనిచేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీటీడీలోని వివిధ విభాగాల్లో జరిగిన అవినీతి అక్రమాలను వెలికి తీసేందుకు ఆయన్ను విచారణాధికారిగా నియమించింది. ఈ క్రమంలో ప్రస్తుతం తిరుపతి విజిలెన్సు విభాగానికి ఇన్‌చార్జి ఎస్పీగా పనిచేస్తున్నారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన విజిలెన్సు ఎస్పీల బదిలీల్లో కరీముల్లా షరీఫ్‌ను తిరుపతి ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

సులువుగా రైతు సేవలు

ఆన్‌లైన్ దిశగా సింగిల్ విండోలు - పైలట్ ప్రాజెక్టు కింద ఈసీపల్లె, నగరి సొసైటీల ఎంపిక



ఎర్రచెరువుపల్లి సింగిల్‌విండోలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ సరంజామా - నగరి సింగిల్‌విండోలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ సరంజామా

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 4: రైతులు పరస్పర సహకారంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనేందుకు ఏర్పాటు చేసిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (సింగిల్ విండోలు) రూపురేఖలు మారనున్నాయి. ఇప్పటివరకు మాన్యువల్ సేవలు అందించిన సంఘాలు డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తున్నాయి. గత ప్రభుత్వ పాలనలో రైతులకు సకాలంలో సేవలు అందించకపోవడం, రాయితీలు పక్కదారి పట్టడం, ఎరువులు తదితర వ్యవసాయ ఉత్పత్తులు సకాలంలో అందకపోవడం వంటి లోపాలు వెలుగుచూశాయి. వీటిని అధిగమించేందుకు డిజిటలైజేషన్ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు నాబార్డు నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 65 మండలాల్లో 75 సింగిల్ విండోలు ఉండగా, వీటిలో ఎర్రచెరువుపల్లి (పూతలపట్టు మండలం), నగరి సంఘాలను పైలట్ ప్రాజెక్టుగా డిజిటలైజేషన్ పనులు ప్రారంభించారు. ఇవి తుది దశకు చేరుకున్నాయి.

● ప్రయోజనాలివీ..

సింగిల్ విండోల్లో నమోదైన ప్రతి ఖాతాదారుడికీ కంప్యూటరైజ్డ్ పాసుబుక్ అందిస్తారు. అందులో వారు తీసుకున్న రుణ వివరాలు, చెల్లించాల్సిన సొమ్ము, వడ్డీ వివరాలు ఉంటాయి. భూముల వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేయడంతో నేరుగా ప్రభుత్వం అందించే రాయితీలు, సబ్సిడీ ఖాతాల్లోకి జమ అవుతాయి.

● ప్రత్యేక నిధులు వెచ్చించి...

జిల్లాలోని 75సింగిల్ విండోల ద్వారా నాలుగు లక్షల మంది రైతులు సభ్యులుగా ఉండగా, సుమారు లక్ష మంది సేవలు పొందుతున్నారు. వారి వివరాలను పూర్తిగా కంప్యూటరీకరించడంతో పాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)కు అనుసంధానం చేస్తున్నారు. ఇందుకోసం అవసరమైన సామగ్రి ఇప్పటికే అందించారు. నాబార్డు అధికారులు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించారు. రికార్డులు మొత్తం ఐదు దశల్లో ఆన్‌లైన్ చేస్తున్నారు.

సేవలు విస్తృతం



సింగిల్ విండోల్లో రికార్డుల కంప్యూటరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. తద్వారా రైతులకు త్వరితగతిన సేవలు అందించే అవకాశముంది. వీటితో పాటు సాధారణ బ్యాంకు సేవలను సైతం అందించే వీలుంటుంది.

- మనోహర్ గౌడ్, సీఈవో, డీసీసీబీ, చిత్తూరు

రోగులను అనవసరంగా రెఫర్ చేస్తే చర్యలు తప్పవు : కలెక్టర్



డాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పుంగనూరు, సెప్టెంబరు 4: పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. రోగులను అనవసరంగా రెఫర్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని బుధవారం ఆయన తనిఖీ చేశారు. నూతనంగా నిర్మాణాలు జరుగుతున్న వైద్యశాల భవనాలను పరిశీలించారు. రోగులను సేవలు గురించి ప్రశ్నించారు. పుంగనూరులో పని చేయాల్సిన డాక్టర్ పద్మాంజలి అన్నమయ్య జిల్లా మదనపల్లెలో పని చేయడం ఏమిటని ఆరా తీశారు. అన్నమయ్యజిల్లాలో పని చేస్తూ చిత్తూరు జిల్లాలో జీతం ఎలా ఇస్తారని డీసీహెచ్ఎస్‌ను ప్రశ్నించారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకుంటున్న రోగులను పరామర్శించి పరీక్షలు ఎలా చేస్తున్నారని అడిగారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఇక్కడ వైద్యం చేయకుండా ఇతర ప్రాంతాలకు అనవసరంగా రెఫర్ చేయరాదని, అవసరమైన మందులు నిల్వ వుండేలా చూడాలన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆస్పత్రిలో కొన్ని సమస్యలు ఉన్నాయని, త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఖాళీగా ఉన్న డాక్టరు పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. అవసరమైన పరికరాలను సరఫరా చేయనున్నట్లు తెలిపారు. చాలా కాలంగా సిబ్బంది ఇక్కడే ఉండటంతో సరిగా పని చేయడం లేదని, వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని టీడీపీ నాయకులు బి.వెంకటముని యాదవ్, సుహేల్‌బాషా కోరారు. తమకు 6 నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ ఖర్చులకూ ఇబ్బందిగా ఉందని పారిశుధ్య కార్మికులు తెలిపారు. కలెక్టరు వెంట మెడికల్ ఆఫీసర్ మధుసూదనాచారి, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బర్డ్‌పై టీటీడీ దృష్టి

- సందర్శించిన ఈవో, జేఈవోలు
- అంతా బాగుందంటూ వైద్యుల వివరణ
- మరి మీడియాలో కథనాలేంటన్న ఈవో



చిన్నారి పేషెంట్ తల్లితో మాట్లాడుతున్న టీటీడీ ఈవో శ్యామలరావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్)పై టీటీడీ అధికారులు దృష్టి పెట్టారు. బుధవారం టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో గౌతమి, మరో జేఈవో, బర్డ్ ఇంచార్జి డైరెక్టర్ వీరబ్రహ్మం బర్డ్ ఆస్పత్రిని సందర్శించారు. అక్కడి వైద్యులతో సమీక్షించారు. అయితే 'బర్డ్‌లో అంతా బాగా జరుగుతోంది' అని వైద్యులు ఈవోను పక్కదారిపట్టించే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. దీంతో ఈవో స్పందిస్తూ ' అంతా బాగుంటే మీడియాలో వారానికో కథనం ఎందుకు వస్తోంది' అని ప్రశ్నించినట్టు సమాచారం. గడిచిన ఐదేళ్లలో బర్డ్ ఆస్పత్రి పాలన పక్కదారిపట్టిందని బుధవారం ఆంధ్రజ్యోతిలో 'గతి తప్పిన బర్డ్' శీర్షికన కథనం ప్రచురితమైంది. అదేవిధంగా రెండు వారాల క్రితం బర్డ్‌లో అవినీతి, అక్రమాలపై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణ జరుగుతోందన్న నేపథ్యంలో 'బర్డ్‌ను భ్రష్టు పట్టించారు' అని మరో కథనాన్ని కూడా ఆంధ్రజ్యోతి ప్రచురించింది. ఈ నేపథ్యంలో టీటీడీ ఈవో, జేఈవోలు బర్డ్‌ను పరిశీలించారు. పత్రికలో వచ్చిన ప్రతి అంశంపై వైద్యులు వివరణ రాసి ఈవోకు అందించినట్టు తెలుస్తోంది. వీటిపై తర్వాత విచారణ చేస్తానని ఈవో చెప్పినట్టు తెలుస్తోంది. బర్డ్ ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు అందుతున్న సదుపాయాలను, వైద్య సేవలను అడిగి ఈవో తెలుసుకున్నారు. అనంతరం అత్యవసర వార్డు, జనరల్ వార్డు, ఎక్సరే, స్కానింగ్, ఓపీ వార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, అన్నప్రసాదాల నాణ్యత గురించి రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

● ఆపరేషన్లు తగ్గలేదు : టీటీడీ

బర్డ్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు టీటీడీ సీపీఆర్వో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన 'గతి తప్పిన బర్డ్' కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. రోగులకు ఓపీ, ఆపరేషన్లు, కృత్రిమ అవయవాల అమరిక వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గత మూడు నెలల్లో 24,429 ఓపీ సేవలు, 1489 ఆర్థోపెడిక్ సేవలు అందించారని, 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉంటున్నారని వెల్లడించారు.గాయానికి కట్టు మార్చడం, కట్టు కట్టడాలు కూడా ఆపరేషన్ల కిందే చూపించి, ఈవోకు తప్పుడు సమాచారం ఇచ్చారన్న చర్చ వినిపిస్తోంది. అదేవిధంగా విజిలెన్స్ విచారణ పైన, సిబ్బంది నిర్లక్ష్యంపైన, మెడికల్ షాపు మూతపైన ఎలాంటి వివరణ ఇవ్వకపోవడం గమనార్హం.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు

సదరన్ డిస్కం నుంచి పాల్గొన్న65 బృందాలు - సీఎండీ కె.సంతోషరావు



విజయవాడ వాంబే కాలనీలో విద్యుత్ పనులు చేస్తున్న తిరుపతి రూరల్ డివిజన్ అధికారులు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 4: విజయవాడలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులకు సదరన్ డిస్కం నుంచి 65 బృందాలు వెళ్లాయని బుధవారం సీఎండీ కె.సంతోషరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరంలో అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించి, సరఫరాను పునరుద్ధరించడానికి సదరన్ డిస్కం నుంచి 810 మంది సిబ్బందిని పంపినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ల ఆదేశాలమేరకు ప్రత్యేక బృందాలను పంపినట్లు చెప్పారు. వరదలు వచ్చిన మరుసటి రోజునుంచే తిరుపతి రూరల్ డివిజన్ నుంచి మూడు బృందాలు పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమైవున్నారని తెలిపారు. విజయవాడ నగరంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను తమకు అప్పగించారని ఆయన తెలిపారు. గత మూడు రోజులుగా స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వరద నీరు తగ్గిన ప్రాంతాల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. నగరంలో తాగునీటి సరఫరా, గృహాలకు విద్యుత్ సరఫరా చేయడానికి మొదటి ప్రాధాన్యతగా పనులు జరుగుతున్నాయని సీఎండీ తెలిపారు. వాంబేకాలనీలో 20వేల గృహాలకు తిరుపతి రూరల్ డివిజన్ సిబ్బంది చేస్తున్న విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను సీఎండీ పరిశీలించారు.

మంచి పౌరుల కొరత తీర్చేది ఉపాధ్యాయులే

గల్లా రామచంద్ర నాయుడు



తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 4: ఇపుడు దేశానికి మంచి పౌరుల కొరత తీవ్రంగా ఉందని, ఆ సమస్యకు పరిష్కారం ఉపాధ్యాయుల చేతిలోనే ఉందని ప్రముఖ పారిశ్రామికవేత్త గల్లా రామచంద్ర నాయుడు అన్నారు.ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం స్థానిక ఎస్వీ నగర్‌లోని తన గురువు ఆచార్య కె.వెంకటరెడ్డిని సత్కరించిన తరువాత ఆయన మాట్లాడుతూ... ఆనాడు వెంకటరెడ్డి వంటి గొప్ప గురువులు ఉన్నందునే యువతలో నైపుణ్యాలు మెరుగుపడ్డాయని చెప్పారు. వారంతా దేశ నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారని తెలిపారు. వెంకటరెడ్డి ఉపాధ్యాయ లోకానికి మార్గదర్శకుడని గుర్తుచేశారు. మాజీ మంత్రి, రచయిత్రి గల్లా అరుణకుమారి మాట్లాడుతూ... వెంకటరెడ్డి తన 93వ యేట ఇటీవలే స్వీయచరిత్ర ప్రచురించారని, వారు విద్యారంగానికి స్ఫూర్తిప్రదాతగా నిలిచారని చెప్పారు. వారి రచనలో ఉపాధ్యాయవృత్తి ఔన్నత్యాన్ని చాటి చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి కుటుంబసభ్యులు హేమలత, విజయ, సుమలత, రచయితలు సాకం నాగరాజ, వాకా ప్రసాద్, విద్యావేత్త జయరామిరెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఫీజు కట్టలేదని విద్యార్థుల గెంటివేత

- ప్రైవేటు పాఠశాల మెట్లపై తండ్రి నిరసన



బడి ముందు పిల్లలతో బైఠాయించి నిరసన తెలుపుతున్న ప్రభాకర్

పలమనేరు, సెప్టెంబరు 4: ఫీజు చెల్లించలేదని చిన్నపిల్లలను బడి నుంచి గెంటేసిన ఓ ప్రైవేటు పాఠశాల నిర్వాహకుల తీరు పలమనేరులో సంచలనం సృష్టించింది. బడి నుంచి గెంటేసిన తన పిల్లలతో తండ్రి బడి మెట్లపై కూర్చొని నిరసన తెలిపారు. దీనిపై ఎంఈవోలు విచారించి డీఈవోకు నివేదిక పంపించారు. అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పలమనేరు మండలం తవడపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్ తన పిల్లలు యోధశ్రీ (1వతరగతి), విక్రమాదిత్య(ఎల్‌కేజీ)ను ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం ఫీజు చెల్లించేందుకు కొంత గడువు కోరగా, యాజమాన్యం తిరస్కరించింది. ఈనేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం పాఠశాల యాజమాన్యం ప్రభాకర్‌కు ఫోను చేసి పిల్లలను తీసుకెళ్లాలని చెప్పారు. ఆయన వెళ్లే సరికే పిల్లలిద్దరూ ఎండలో పాఠశాల మెట్లపై కూర్చొని ఉన్నారు. ఫీజు చెల్లించేందుకు కొంత గడువు అడిగానని అప్పటికే చిన్నపిల్లలని ఎలా ఎండలో పంపించేస్తారని సిబ్బందిని ఆయన నిలదీశారు. వారి నుంచి సమాధానం లేకపోవడంతో పిల్లలతో కలిసి బడిముందు మెట్లపై బైఠాయించారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాఠశాల హెచ్ఎంను ఎంఆర్‌సీ కార్యాలయానికి ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం పిలిపించారు. జరిగిన ఘటనపై ఇరువురి నుంచి విచారణ జరిపారు. ఫీజు చెల్లించనంత మాత్రాన ఇలా బడినుంచి పిల్లలను గెంటి వేయడం సరైన పనికాదని హెచ్ఎంకు సూచించారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిక పంపుతున్నట్లు ఎంఈవోలు తెలిపారు.

సీఐల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 4: నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు.చంద్రగిరిలో పనిచేస్తున్న రామయ్యను ఎస్వీయూనివర్శిటీకి, ఇక్కడ పనిచేస్తున్న మురళీమోహన్‌ను తిరుమల టూటౌన్‌కు బదిలీ చేశారు.తిరుమల టూటౌన్‌లో పనిచేస్తున్న సత్యనారాయణను వీఆర్‌కు పంపారు. ఎన్నికల ముందు వీఆర్‌కు పంపిన అబ్బన్నను తిరుపతి క్రైం పోలీ స్టేషన్ సీఐగా నియమించారు. వీరందరూ రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనుండగా చంద్రగిరి సీఐగా సుబ్బరామిరెడ్డి బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పనిచేద్దాం

పోలీసు అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు 4: రైలు ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా అన్ని విభాగాలు పనిచేయాలని అదనపు ఎస్పీ రవిమనోహరాచారి అన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లోని వీఐపీ ఛాంబర్‌లో బుధవారం లా అండ్ ఆర్డర్, బాంబుడిస్పోజల్ విభాగం, స్పెషల్ ఇంటెలిజన్స్ విభాగం, జీఆర్పీ, రైల్వే భద్రతా దళాల అధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రైల్వే ప్రయాణికుల పట్ల ఆర్పీఎఫ్, జీఆర్పీ విభాగాలు తీసుకుంటున్న చర్యలను ఐపీఎఫ్ అధికారి మధుసూదన్ వివరించారు. రైల్వే స్టేషన్లలో నష్టాలు జరుగకుండా అన్ని విభాగాలు సహకరించాలని కోరారు. అన్ని విభాగాల సహకారం ఉంటుందని అదనపు ఎస్పీ రవిమనోహరాచారి చెప్పారు. అలాగే రైళ్లలో జరుగుతున్న నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను అరికట్టడానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రయాణికుల లగేజీలు, వస్తురవాణా విభాగాలపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. రైల్వే విభాగానికి, భారత ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లే విధంగా తీవ్ర వాద సంస్థలనుంచి వస్తున్న సమాచారాలపై, తీసుకోవలసిన పటిష్ఠ భద్రతా చర్యలపై అధికారులు చర్చించారు. సమావేశంలో తిరుపతి డీసీఐవో ఐబీ అధికారి పి.శిరీష, డీఎస్పీలు, ఇతర శాఖల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు

తిరుమల, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఆ వివరాలను టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 57,817 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 17,592 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీవారి సేవలో హీరో కిరణ్ అబ్బవరం



తిరుమల, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): సినీహీరో కిరణ్ అబ్బవరం దంపతులు బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఇటీవల కిరణ్, రహస్యల వివాహం జరిగిన విషయం తెలిసిందే. ఈక్రమంలో శ్రీవారి ఆశీస్సుల కోసం ఈనూతన దపంతులు బుధవారం తిరుమలకు చేరుకుని ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు.ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు హీరో కిరణ్ అబ్బవరం దంపతులను చూసేందుకు సినీ అభిమానులు ఆశక్తి చూపారు. కిరణ్ 'ఎస్ఆర్ కల్యాణమండపం', 'రాజావారు రాణివారు', 'రూల్స్ రంజన్' వంటి సినిమాల్లో నటించి మంచి పేరు పొందిన విషయం తెలిసిందే.

'చేతనైతే సాయం చేయండి'

ములకలచెరువు, సెప్టెంబరు 4: చేతనైతే వరద బాధితులకు సాయం చేయాలి తప్ప ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలను జగన్‌రెడ్డి మానుకుంటే మంచిదని రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు హితవు పలికారు. మండలంలోని చౌడసముద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రేయింబవళ్లు సహాయక చర్యలు సమీక్షిస్తున్నారన్నారు. మంత్రి నారా లోకేష్ కూడా నేరుగా సహాయక చర్యలు చేపడుతున్నారన్నారు. వరదబాధితులకు అండగా నిలవకుండా అధికార పక్షంపై విమర్శలు చేసి రాజకీయం చేయడం జగన్‌కే చెల్లుతోందన్నారు. గతంలో వరదలు వచ్చినప్పుడు జగన్ హెలికాప్టర్‌లో తిరిగి, రెడ్‌కార్పెట్ మీద నడిచి వెళ్లడం తప్ప బాధితుల దగ్గరకు ఏనాడూ వెళ్లలేదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ నరసింహులు, నాయకులు చాంద్‌బాషా, సుధాకర్‌నాయుడు, చంద్రప్ప, వెంకట స్వామి, చంద్రశేఖర్, రమణప్ప, రవి నాయుడు, వెంకటరమణ, తిరుపాల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి..



క్రీడాకారులకు సూచనలిస్తున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్

వాల్మీకిపురం, సెప్టెంబరు 4: ప్రతి క్రీడాకారుడు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ సూచించారు. వాల్మీకిపురంలోని జీవీఎస్‌సీఎస్ క్రికెట్ మైదానంలో బుధవారం మదనపల్లె డివిజన్ అండర్-14 జిల్లా ప్రాబబుల్ ట్రయల్స్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మ్యాచ్ ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నెక్ట్ లెవెల్ మ్యాచ్‌లకు ఎంపిక చేస్తామన్నారు. అనంతరం క్రీడాకారులకు ఆటలో మెళకువలు నేర్పించారు. జిల్లా అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్‌కుమార్, శ్రీనివాసులు, కోచ్ సునీల్‌కుమార్, గ్రౌండ్ ఇన్‌చార్జిలు మహ్మద్‌షాహిద్, భరత్, సీనియర్ క్రీడాకారులు ఖాదర్‌బాబా, రామకృష్ణ, పఠాన్, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం

పీలేరు, సెప్టెంబరు 4: గత నెలలో జరిగిన కలికిరి ఎల్లమ్మ జాతరలో విశేష సేవలు అందించిన పీలేరుకు చెందిన పలువురు ఉద్యోగులను ఆర్టీసీ రాయచోటి ఆర్‌ఎం రాము బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎం బండ్ల కుమార్, తదితరులు పాల్గొన్నారు

ఉరి వేసుకుని వ్యక్తిఆత్మహత్య



నరసింహులు (ఫైల్ ఫొటో)

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 4 : కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు. మండలంలోని కాట్నగల్లు గ్రామానికి చెందిన నక్కోళ్ల కదిరప్ప కుమారుడు నరసింహులు (38) కొంతకాలంగా కడుపునొప్పికి చికిత్స పొందుతున్నాడు. మంగళ వారం రాత్రి కడుపునొప్పి తీవ్రం కావడంతో భార్య మందులను తెచ్చేందుకు వెళ్లింది. ఆ సమయంలో నరసింహులు ఇంట్లో ఉరి వేసుకున్నాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు నరసింహులును బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, నరసింహులు కు రెండు పెళ్లిళ్లు కాగా మొదటి బార్య ఉమాదేవి మృతి చెందడంతో, మాలతి అనే యువతిని పెళ్లి చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

కురబలకోట, సెప్టెంబరు 4: కారు ఢీకొనడంతో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. తంబళ్ళపల్లె మండలం గోపిదిన్నెకు చెందిన రామయ్య(48) మదనపల్లె శివార్లలోని అమ్మచెరువు మిట్టలో నివాసముంటూ ఆటో నడుపుకుంటున్నాడు. బుధవారం ఉదయం ఆటోలో అంగళ్లకు వస్తుండగా ద్వారకనగర్ వద్ద వెనుకవైపు నుంచి కారు ఢీకొంది. దీంతో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ముదివేడు పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'గురుకుల' సమస్యలన్నీ పరిష్కరిస్తాం



గురుకుల విద్యార్థినులకు భోజనం తినిపిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 4: గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. బుధవారం చంద్రాకాలనీనిలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి మధ్యాహ్న బోజనం తిని, సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ వసుందర మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో 11 కేవీ విద్యుత్ లైన్లు వెళుతున్నాయని, వర్షం వస్తే గాలులకు తీగలు తగులుకుని నిప్పురవ్వలు రాలుతున్నాయని , ఎగువన వున్న ఇళ్లలోని మురుగునీరు గురుకుల పాఠశాల మీదుగా వెళుతోందని ఫిర్యాదు చేశారు. విద్యార్థినుల స్నానాలకు సోలార్ హీటర్, అదనంగా ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. విద్యార్థినుల రక్షణతో పాటు మంచి ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

ఇండియా జీఏపీ సర్టిఫికేషన్‌తో వేరుశనగకు మంచి ధర

● డీఏవో చంద్రానాయక్



వేరుశనగ పైరును పరిశీలిస్తున్న డీఏవో చంద్రానాయక్

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 4: ఇండియా గుడ్ అగ్రికల్చర్ ప్యాకేజీ(ఇండి జీఏపీ) సర్టిఫికెట్ పొందితే వేరుశనగకు మంచి ధర పలుకుతుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి(డీఏవో) చంద్రానాయక్ సూచించారు. బుధవారం మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ మేకలవారిపల్లె వద్ద పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఏపీ సర్టిఫికేషన్ పొందిన పంటను మదనపల్లె పట్టణంలోని మర్యాద రామన్నపట్నం ఎఫ్‌పీవో ద్వారా కొనుగోలు చేస్తారన్నారు. వ్యవసాయంలో మెళకువలతో మంచి దిగుబడి వస్తుందన్నారు. పొలంబడిలో క్రమం తప్పకుండా రైతులు పంటలను పరిశీలించాలన్నారు. రుతువులను అనుసరించి వాతావరణంలో కలిగే మార్పులను గమనిస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. మిత్ర పురుగులను సంరక్షించాలన్నారు. ఏవో నాగప్రసాద్, టెక్నికల్ ఏవోలు వెంకటమోహన్, రమేశ్‌రాజు, ఎఫ్‌పీవో నిర్వాహకులు అమరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

సాగు వివరాలు నమోదు చేయాలి

గుర్రంకొండ/కురుబలకోట: రైతులు సాగు చేసిన పైర్ల వివరాలను డీఏవో సూచించారు. గుర్రంకొండ పంచాయతీ దౌలత్‌ఖాన్‌పల్లె, కురుబలకోట మండలం ముదివేడు సమీపంలో వేరుశనగ, పూల పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ క్రాప్‌లో నమోదు చేసుకుంటే పంట నష్టపోయినప్పుడు మేలు జరుగుతుందన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది పంటల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో ఏడీఏ శివశంకర్, ఏవోలు రాధ, నవీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై తక్షణం స్పందించండి



సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, సెప్టెంబరు 4: నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి సూచించారు. ములకలచెరువులో బుధవారం ఆరు మండలాల ఈవోఆర్డీల సమావేశంలో ఆయన మాట్లాడతూ నియోజవర్గంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్యలను గత ప్రభుత్వంలో పరిష్కరించలేదన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు వైసీపీ సర్పంచులు ఇష్టారాజ్యంగా డ్రా చేసే అవకాశం ఉందని, దీనిపై నిఘా ఉంచాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు సత్వరం చర్యలు తీసుకుని అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, ఆరు మండలాల ఈవోఆర్డీలు మోహన్‌ప్రతాప్, అబ్దుల్‌షకూర్, యోగానంద్, దిలీప్‌కుమార్, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మండలంలోని సోంపాళ్యం గ్రామానికి సీసీ రోడ్డు ఏర్పాటు పనులకు దాసరిపల్లి జయచంద్రారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత చెన్నకేశవ ఆలయానికి, గ్రామాని కి తన చేతుల మీదుగా రోడ్డు పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ జిల్లా కార్య దర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నాయకులు వెంకటసిద్ధయ్య, పాలరాము, శంకర, బయన్న, ఉత్తన్న, శ్రీనివాసులు, రమణప్ప, షఫీ, ఉత్తన్న, చలపతి, రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కేశవరెడ్డి, మణి, అశోక్, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులు, వ్యాపారుల సహకారంతోనే రైతు బజార్ల విజయవంతం



మాట్లాడుతున్న మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 4: రైతు బజార్ నిర్వహణకు రైతులు, వ్యాపారుల సహకారం చాలా అవసరమని మార్కెటింగ్ శాఖ ఏడీ త్యాగరాజు, ఉద్యానశాఖ జిల్లా అధికారి రవిచంద్రబాబు తెలియజేశారు. బుధవారం స్థానిక రైతు బజార్‌లో రైతులు, వ్యాపారులు, పురప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాటాడుతూ రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో రైతు బజార్‌లు విజయవంతంగా నడుస్తున్నాయని, కానీ, మదనపల్లెలో నిరుపయోగంగా ఉండటంతో చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశించారన్నారు. దీనిపై రైతులు, ఎఫ్‌పీవోలు, వ్యాపారుల అభిప్రాయాలను కోరారు. రైతు బజార్ పక్కనే ఉన్న వారపు సంతకు అడ్డంగా వున్న గోడ తొలగించి రైతులు, వ్యాపారులు రైతుబజార్‌లోని స్టాళ్లను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు మాట్లాడుతూ ఉద్యాన పంటలు, పాలు, పెరుగు, చేపలు, కోడిగుడ్లు తదితరాలను ఇక్కడ వున్న 34 స్టాళ్లలో విక్రయించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రకృతివనం ప్రసాద్ మాట్లాడుతూ బయట మార్కెట్‌లోగేటు రుసుం చెల్లించాలని, అదే రైతు బజార్‌లో విక్రయిస్తే ఎలాంటి గేటు రు సుం వుండదన్నారు. రైతులు కూడా వారి అభి ప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటి ని పరిగణలోకి తీసుకుని అధికారులు ప్రణాళిక లు సిద్ధం చేసి రైతు బజార్‌ను నిర్వహణలోకి తీసుకొస్తారన్నారు. ఈ సమావేశంలో ఫిషరీస్ ఏడీ సుస్మిత, మార్కెట్ యార్డు సెక్రెటరీ అభిలాష్, ఉద్యాన అధికారి ఈశ్వరప్రసాద్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి జరుపుకోవాలి

వాల్మీకిపురం, సెప్టెంబరు 4: వినాయకచవితి పండుగ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని సూచించారు. స్పీకర్ల ఏర్పాటు, రికార్డింగ్ డాన్సులు, డీజేలు నిర్వహించరాదని ఆదేశించారు. ఉత్సవ కమిటీలు బాధ్యతగా వ్యవహరించాలని మండపాల వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. విగ్రహాల ఏర్పాటు మొదలు పోలీసుల నిఘా ఉంటుందని ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విగ్రహాల ఏర్పాటు మొదలుకుని నిమజ్జనం దాకా మండపాల వద్ద మద్యం సేవించడం, రాత్రి సమయాలలో డాన్సులు, బాణసంచా నిషేధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీహరి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుర్రంకొండ: మండల కేంద్రంలో ఎస్ఐ మధురామచంద్రుడు గణపతి మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. నిమజ్జనాన్ని ఎప్పుడు చేసేది ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు.

ములకలచెరువు: వినాయక చవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ రాజరమేష్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం వినాయక చవితి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవ కమిటీ, ముస్లిం మత పెతపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలకు సహకరించుకోవాలన్నారు. సాయంత్రం బస్టాండు సర్కిల్‌లోని దుకాణదారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సర్వీస్‌రోడ్డు, ఫుట్‌పాత్ అడ్డుగా దుకాణాలు పెట్టుకుని ఇబ్బందులు కల్గించవద్దన్నారు. ట్రాఫిక్‌కు, పాదచారులకు ఇబ్బందులు కల్గిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశాల్లో ఎస్ఐ గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో ఐదుగురి అరెస్టు



నిందితులను చూపుతున్న సీఐ గురునాథ్

కలకడ, సెప్టెంబరు 4: హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ గురునాథ్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కలకడ మండలం కోన పంచాయతీ తిప్పి గారి పల్లెకు చెందిన సాంబశివ (40) కారు డ్రైవర్. గత నెల 24న బాడుగకు వెళ్లిన అతను నాలుగు రోజులైనా తిరిగి రాకపోవడంతో భార్య నాగరాణి 29వ తేదీన కలకడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కలకడ, కేవీపల్లె ఎస్ఐలు రామాంజనేయులు, రహీముల్లా ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేయగా వెలుగులోకి వచ్చిన వివరాలిలా ఉన్నాయి. సాంబశివ అక్క నాగవేణి, బావ రెడ్డెప్ప కుటుంబం మదనపల్లెలో నివాసముంటుంది. వారి పెద్ద కూతురు మమత మదనపల్లెకు చెందిన జగదీశ్ అనే యువకుడిని కులాంతర వివాహం చేసుకుని తల్లిదండ్రులు దూరంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో సాంబశివ తన అక్క బావలకు అన్ని విషయాల్లో అండగా ఉండేవాడు. అత్తమామలు తమపై ప్రేమ చూపక పోవడానికి సాంబశివే కారణమని భావించిన జగదీష్ అతనిని హత్య చేయడానికి పథకం రచించాడు. తంబళ్లపల్లె మండలం గోపిదిన్నెకు చెందిన ఆంజినేయులు అలియాస్ ఆంజితో రూ.6 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆంజినేయులు సత్యసాయి జిల్లా ఎన్‌పీకుంట మండలం గోపాలపురానికి చెందిన సోమ శేఖర్, మరో ఇద్దరు మైనర్‌లతో కలసి గత నెల 24న సాంబశివకు ఫోన్ చేసి కర్ణాటక రాష్ట్రంలోని ఆలయాలను దర్శించుకోవడానికి కారును బాడుగకు మాట్లాడుకున్నారు. ఉత్తర కన్నడ జిల్లాలోని జోగ్‌ఫాల్స్ వద్దకు తీసుకువెళ్లారు. 26వ తేదీ మధ్యాహ్నం హొన్నవర-బెంగుళూరు జాతీయ రహదారిలోని అటవీ ప్రాంతంలో ఆగి, సాంబశివకు మద్యం తాగించి, అతను మత్తులోకి వెళ్లగానే తలపై రాళ్లతో దాడిచేసి చంపేశారు. మృతదేహాన్ని అక్కడే వదిలి అతని కారును సమీపంలోని వదిలి మదనపల్లెకు వచ్చేశారు. కారుతోపాటు, సెల్ ఫోన్లు, కత్తి స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు సీఐ వివరించారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరి మృతి

● ఇద్దరికి తీవ్ర గాయాలు
ఆస్పత్రికి తరలింపు



మృతి చెందిన జావేద్ (ఫైల్ ఫొటో)



తీవ్రంగా గాయపడిన అబ్దుల్

పీలేరు, సెప్టెంబరు 4: ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. పీలేరు పోలీసుల కథనం మేరకు కలకడకు చెందిన జావేద్, సుహేల్ స్నేహితులు. వీరిలో ఒకరు కారు పెయింటరు కాగా, మరొకరు టింకరు. తమ వద్ద రిపేరుకు వచ్చిన ఓ కారుకు కావాల్సిన సామాను కొనుగోలుకు ద్విచక్ర వాహనంపై బుధవారం ఉదయం పీలేరుకు వచ్చారు. మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో కలకడకు బయలుదేరారు. చిత్తూరు జిల్లా ఎస్‌ఆర్ పురం మండలం ఎగువ ముదిగుబ్బకు చెందిన అబ్దుల్ బైక్‌పై రాయచోటి నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ రెండు వాహనాలు పీలేరు మండలం పొంతలచెరువు క్రాసు వద్ద ఢీకొన్నాయి. ప్రమాద తీవ్రతకు రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసం కాగా వాటిపై ప్రయాణిస్తున్న ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జావేద్, సుహేల్ పరిస్థితి విషమంగా ఉండడంతో బంధువులు వారిని తిరుపతికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో జావేద్ ప్రాణాలు వదిలాడు. సుహేల్ రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో గాయపడ్డ అబ్దుల్ పరిస్థితి తీవ్రంగా ఉన్నా, అతని బంధువులు రాకపోవడంతో పీలేరులోనే వైద్యం అందిస్తున్నారు. ప్రమాదంలో జావేద్ మృతి చెందాడన్న విషయం తెలుసుకుని అతని కుటుంబసభ్యులు, స్నేహితులు పీలేరు ఆసుపత్రికి చేరుకుని భోరున విలపించారు. అవివాహితుడైన జావేద్‌కు ఇటీవల పెళ్లి సంబంధాలు చూస్తున్నారని, పెళ్లి పీటలు ఎక్కుతాడనుకుంటే పరలోకానికి పయనమైపోయాడని అతని మిత్రులు కంటతడి పెట్టుకున్నారు. మృతదేహాన్ని పీలేరు మార్చురీ కి తరలించారు. పీలేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి నల్లారి పరామర్శ

జావేద్ కుటుంబాన్ని బుధవారం సాయంత్రం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పరామర్శించారు. జావేద్ సోదరుడు ఖాజా టీడీపీ నాయకుడు కావడంతో ఆయన ద్వారా విషయం తెలుసుకున్న కిశోర్ కుమార్ రెడ్డి హుటాహుటిన పీలేరు ఆసుపత్రికి చేరుకుని వారిని ఓదార్చారు. టీడీపీ నేతలు నారే సతీశ్, పురం రామ్మూర్తి, లక్ష్మీకర, రెడ్డిముని, మహమ్మద్‌పీర్, తదితరులు పాల్గొన్నారు.

భూమి చూపకపోతే ఆత్మహత్య చేసుకుంటాం!

● దంపతుల అల్టిమేటం
● పోలీసు, రెవెన్యూ అధికారుల హైరానా

కలికిరి, సెప్టెంబర్లు 4: వారసత్వంగా తమకు సంక్రమించిన భూమిని అధికారులు చూపించకపోవడంతో రైలుకిందపడి ఆత్మ హత్య చేసుకుంటున్నామంటూ ఓ జంట ఓ రిపోర్టరుకు ఫోన్ ద్వారా సమాచారం అందించడం అధికారుల్లో కలవరం రేపింది. ఈ సమాచారంతో ఆ దంపతుల ఫోన్ లొకేషన్ ఆధారంగా కలికిరి ఇన్‌స్పెక్టరు కె. రెడ్డిశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గాలించారు. మరో వైపు తహసీల్దారు స్వయంగా రంగంలోకి దిగి రైల్వే ట్రాక్ వెంబడి వెదికారు. రెండు గంటల తరువాత కలికిరి సమీపంలో దంపతులను గుర్తించిన అధికారులు వారికి నచ్చచెప్పి రోడ్డు పైకి తీసుకొచ్చారు. తహసీల్దారు మహేశ్వరీ బాయి, హెచ్‌సీ రాజేంద్ర ప్రసాద్ సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లేందుకు అంగీకరించారు. ఈ సమస్య ఒక కొలిక్కి రావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

కొత్తమాలపల్లెకు చెందిన గంధం రాఘవులు తనకున్న 2.61 ఎకరాల్లో ఒక ఎకరా విక్రయించేశాడు. మిగిలిన దానిలో 50 సెంట్లు తన కూతురు నాగరాణికి చెందేట్లు వీలునామా రాశాడు. అతను మృతి చెందడంతో మిగిలిన 1.11 ఎకరాల భూమిని అతని కోడలు సుశీల రెండేళ్ల క్రితం మరో వ్యక్తికి విక్రయించింది. ఈ మొత్తం భూమి పోనూ తనకు చెందిన 50 సెంట్ల భూమి చూపాలని నాగరాణి భర్త హెన్రీ రమేష్‌తో కలసి కొన్నేళ్ళుగా ఎమ్మార్వో కార్యాలయానికి తిరుగుతున్నా పని కాలేదు. దీంతో బుధవారం వారు ఆత్మహత్యా ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించిన తహసీల్దారు రోడ్డు, కాలువకు పోనూ నాగరాణికి రావలసిన 50 సెంట్లు భూమి లేదని గుర్తించారు. డీకేటీ భూమి ఎలా విక్రయించారు, అందుకు సహకరించిన అధికారులెవరు అన్న అంశంపై అధికారులు ఆరా తీస్తున్నారు.

మట్టి గణపతి ప్రతిమలను పూజిద్దాం..



మట్టితో వినాయకుడి ప్రతిమలు తయారు చేస్తున్న విద్యార్థినులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 4: వినాయక చవితి పండుగ సందర్భంగా ఇళ్లలో, పందిళ్లలో మట్టి వినాయకుడి ప్రతిమలను ఏర్పాటు చేసుకుని, పర్యావరణాన్ని కాపాడుదామని ప్రిన్సిపాల్ కృష్ణవేణి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులతో మట్టి వినాయకుడి విగ్రహాలను తయారు చేయించారు. ఈ సందర్భంగా అధ్యాపకురాలు మోహనవల్లి మాట్లాడుతూ పీవోపీ, రసాయనాలతో తయారు చేసే విగ్రహాలు నిమజ్జనం చేస్తే నీరు కలుషితం అవుతుందని, దీని వలన జీవకోటి ప్రాణాలకు ప్రమాదం పొంచి వుందన్నారు. విద్యార్థినుల్లో చైతన్యం తీసుకురావడానికి ఎకో ఫ్రెండ్లీ క్లబ్ కన్వీనర్ కుసుమ ప్రియ మట్టి విగ్రహాల తయారీ నేర్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సూర్యశేఖర్‌రెడ్డి, సుబ్బ రాయుడు, గురుమూర్తి, విష్ణుప్రియ, నమ్రత, జ్యోతి, హాజీరా బేగం తదితరులు పాల్గొన్నారు.

విద్యా బోధన సరళంగా ఉండాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 4: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సరళ పద్ధతిన బోధన చేయాలని ఎంఈవో-2 నారాయణ సూచించారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజన మెనూ పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. విద్యార్థులు కచ్చితంగా యూనిఫాం ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి చేయాలి



మొక్క నాటుతున్న జనసేన ఇంచార్జ్ పోతుల సాయినాథ్ తదితరులు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 4: జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ పిలుపునిచ్చారు. మండలంలోని మల్లెల గ్రామంలో బుధవారం ఆయన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి జనసేన పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జనసేన జెండాను ఆవిష్కరించాలన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనసేన నాయకులు, ఎంఈవో నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అపర్ణాదేవితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు శంకర, మల్లెల సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, జనసేన ఉపాధ్యక్షుడు సూరి, నాయకుడు అరుణ్ కుమార్ రెడ్డి, అధికార ప్రతినిధి దేవేంద్ర, షోరూం సూరి, గణేష్, సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు కుందిలి వెంకటరెడ్డి, హరి, ఎర్రమరెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, రాజా రెడ్డి, నరసింహులు, మునిరెడ్డి,పెద్దపాళ్యం అంజి, రాజశేఖర్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో కేఎన్ బాలాజీ

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 4 : మండలంలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో కేఎన్ బాలాజీ, పంచాయతీ విస్తరణాధికారి యోగానంద సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో కలసి బుధవారం ఓ ప్రత్యే కమిటీ ఏర్పాటు చేశారు.ఆగిపోయిన గృహ నిర్మాణాలను వెంటనే ప్రారంభించేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వారితో కలసి పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలను ఎందుకు ఆపేశారు. ఎంత వరకు బిల్లులు మంజూరయ్యాయి. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. పనులు వెంటనే ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుమలతతో పాటు ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగార్జున, ముస్తఫాతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'తరిగొండ' ఆలయ హుండీ ఆదాయం రూ.7 లక్షలు

గుర్రంకొండ, సెప్టెంబరు 4:గుర్రంకొండ మండలం తరిగొండ లక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయాన్ని బుధవారం టీటీడీ అధికారులు లెక్కించారు. ఈ సందర్భంగా రూ.7,10,390 లక్షల ఆదాయం వచ్చినట్లు సూపరింటెండెంట్ రమణయ్య తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణప్రసాద్, కృష్ణరాజు, అనిల్, గోకుల్, వెంకీ, వరద, ఆలయాధికారి కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురికి 'శ్రేష్ట గురు' అవార్డు

పీలేరు/మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 4: పీలేరుకు చెందిన ప్రముఖ కవి, రచయిత, తెలుగు భాషా సమితి అధ్యక్షుడు జలకనూరి మురళీధర రాజు, మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పఠాన్ మహమ్మద్ ఖాన్, మదనపల్లె యూత్ కరాటే అసోసియేషన్ వ్యవస్థాపకుడు, కరాటే మాస్టర్ డాక్టర్ ఏఆర్ సురేష్‌కుకు 'శ్రేష్ట గురు' అవార్డు లభించింది. తిరుపతికి చెందిన 'వియ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్టు, రేవతి ఫౌండేషన్' సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం తిరుపతిలో నిర్వహించిన ముందస్తు ఉపాధ్యాయ దినోత్స వాల్లో భాగంగా నిర్వాహకులు వారికి అవార్డు అందించడంతోపాటు ఘనంగా సన్మానించారు

నైపుణ్య ప్రదర్శనతోనే మెరుగైన ఉద్యోగావకాశాలు

కురబలకోట, ఆగస్టు 28: నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలను సాధించవచ్చునని రిసోర్సుపర్సన్ పాల్‌జోసెఫ్ తెలిపారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు టెక్నికల్ ఇంటర్వ్యూల కోసం నిపుణుల వ్యూహాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక అంశాలపై పట్టుసాధించాలన్నారు. ప్రతి ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ కోసం కోడింగ్ అసరమన్నారు. ముఖ్యంగా స్కిల్ కోడింగ్ ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు శ్రీదేవి, గీత, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

ఓటరు క్లెయిముల పరిష్కారంలో వేగం పెంచాలి

పీలేరు, సెప్టెంబరు 4: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2025లో భాగంగా క్లైముల పరిష్కారంలో వేగం పెంచాలని ఈఆర్‌వో రమ బీఎల్‌వోలను ఆదేశించారు. పీలేరు నియోజకవర్గంలోని బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు బుధవారం పీలేరులోని సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ -2025పై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లైముల పరిష్కారంలో పీలేరు చాలా వెనుకబడి ఉందని అసహనం వ్యక్తం చేశారు. పలువురు బీఎల్‌వోలు చురుగ్గా పనిచేయడం లేదన్నారు. అలసత్వం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన విధానాలను సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పీలేరు, కేవీపల్లె, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడ తహసీల్దార్లు భీమేశ్వర రావు, క్రాంతి కుమార్, మహేశ్వరి బాయి, పామిలేటి, శ్రీనివాసులు, ఫణికుమార్, డీటీ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ చాణక్య, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా నిలుద్దాం..

● జనసేన రాయలసీమ జిల్లాల కోఆర్డినేటర్ దారం అనిత

రామసముద్రం, సెప్టెంబరు 4: రాష్ట్రంలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నిరాశ్రయులైన వారికి మానవతా దృక్పథంతో సాయం చేసి ఆదుకోవాలని జనసేన రాయలసీమ జిల్లాల కోఆర్డినేటర్ దారం అనిత పిలుపునిచ్చారు. మండల సైనికుల ఆహ్వానం మేరకు బుధవారం రామసముద్రంకు విచ్చేసిన ఆమెకు జనసైనికులు, బలిజ సంఘం నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం బలిజవీధిలో జనసేన నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరద ప్రభావంతో అతలాకుతలమవుతున్న విజయవాడ ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ స్ఫూర్తితో జనసేన నాయకులు, సైనికులు తమ వంతు సాయం అందించేందుకు కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బేకరి జనార్దన్, కోలా హరినాథ్, గండోడి అంజప్ప, ఫొటో స్టూడియో శ్రీనివాసులు, లక్ష్మీపతి, సూరిశంకర, మల్లిక, చంద్రశేఖర్, వెంకటేష్, సురేష్, గిరీష్, ప్రకాష్, బలిజ సంఘం నాయకులు, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 4: వరద బాధితుల సహాయార్థం మదనపల్లె జనసేన సీనియర్ నాయకుడు శ్రీరామ రామాంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం పెద్ద ఎత్తున విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తుకు ప్రతి ఒక్కరూ సహకరించి సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఏతోడు లేని వరద బాధితులకు తమవంతు సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జగదీష్‌బాబు, నాయని సోము, శంకర కుమార్, యాసీన్, టీడీపీ నాయకులు లతీఫ్, శేఖర్, రవి, తదితరులు పాల్గొన్నారు.